# వార్త

ఆదివారం

26 ఏప్రిల్, 2026







# నిప్పు..

# టచ్ చేస్తే ముప్పు



# గోపీచంద్ కొత్త సినిమా

## భరతవర్ష సాగా ఆఫ్ శూల

మాస్ హీరో గోపీచంద్ తన 33వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాకు 'భరతవర్ష సాగా ఆఫ్ శూల' అనే టైటిల్ నిర్ణయించారు. ఇందులో గోపీచంద్ గతంలో కనిపించని రీతిలో నప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ చిత్రం 7వ శతాబ్దం నాటి అవిభక్త భారతదేశంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. చారిత్రక అంశాలకు పౌరాణిక నేపథ్యాన్ని జోడించి దర్శకుడు సంకల్ప్ రెడ్డి దీన్ని రూపొందిస్తున్నారు. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్నారు.

ఈ చిత్రానికి అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో గోపీచంద్‌కు జోడీగా రీతూ వర్మ నటిస్తోంది. గత కొంత కాలంగా సరైన విజయం కోసం ఎదురు చూస్తున్న గోపీచంద్‌కు ఈ భారీ హిస్టారికల్ యాక్షన్ చిత్రం కమ్‌బ్యాక్ ఇస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. సినిమా విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

తారాతీరం

# అతిథి పాత్రలో షారుక్ ఖాన్

'పుష్ప'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్‌తో సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసిన చిత్రబృందం ఇప్పుడు మరో ఆసక్తికరమైన వార్తతో చర్చల్లో నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

గతంలో షారుక్ ఖాన్‌తో అట్లీ తీసిన 'జవాన్' చిత్రం భారీ విజయం సాధించింది. వీరిద్దరి మధ్య ఉన్న మంచి అనుబంధం కారణంగానే 'రాకా'లో అతిథి పాత్రకు షారుక్ అంగీకరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ సరికొత్త గెటప్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఇక హీరోయిన్ విషయంలోనూ దీపికా పదుకొణె పేరు బలంగా వినిపిస్తుండగా, రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.



ఆదివారం వార్త

26 ఏప్రిల్, 2026

## మంచి ముత్యాలు

- నూతన మిత్రుణ్ణి, పాత శత్రువులను నమ్మవద్దు. - కెల్లి
- సుఖంగా మరణించాలంటే చాలా ఖర్చవుతుంది.
- శామ్యూల్ బట్లర్

## కదంబం


'సంఘీ'భావం....5

ట్రిపుల్ ఆర్‌కు మోక్షం కలిగేనా?

కవర్ స్టోరీ..6

నిప్పు..

టచ్ చేస్తే ముప్పు

ఈ వారం కవిత్వం.. 11

ఊగిసలాటలు

కవిత్వానికి ...18

కథ..20

సారీ.. కాదు అంతకుమించి

ఏకాగ్రతను పెంచే పుస్తక పఠనం.. 23

ఇంకా...

మొగ్గ

పుస్తక సమీక్ష

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..


## సమాచారం

# ఆ గ్రామంలో తిట్లు నిషేధం!

మధ్యప్రదేశ్‌లోని ఓ గ్రామం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బుర్హాన్‌పూర్ జిల్లాలోని బోర్సర్ అనే ఈ పల్లెలో ఎవరైనా అసభ్య పదజాలం వాడితే కఠిన శిక్ష విధిస్తున్నట్లు తెలుస్తోంది. నోరు జారిన వారికి రూ.500/-లు జరిమానా లేదా గంటపాటు గ్రామ వీధులను శుభ్రం చేయాలనే నిబంధనను అమలు చేస్తున్నారు. సభ్యత, మర్యాదను పెంపొందించేందుకు తీసుకున్న ఈ నిర్ణయం సత్ఫలితాలనిస్తోంది. గ్రామాధికారులు, ఓ సామాజిక కార్యకర్త ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. గతంలో ఈ గ్రామంలో చిన్న పిల్లలు సైతం బహిరంగంగా బూతులు మాట్లాడుతూ గొడవలకు దిగేవారు. తద్వారా గ్రామ వాతావరణం దెబ్బతింటోందని భావించి, ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీ ఈ నిబంధనపై అధికారికంగా తీర్మానం చేసి, ఊరంతా పోస్టర్లు అంటించింది. ఈ నియమం అమలులోకి వచ్చాక గ్రామంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గ్రామస్థులంతా సభ్యతతో కూడిన భాష వాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఇరవై మందికి పైగా వార్డు సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తుండటంతో ఈ నియమం సమర్థంగా అమలవుతోంది. ఈ మార్పుతో ఇప్పుడు గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, ముఖ్యంగా మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని సర్పంచ్ తెలిపారు. అసభ్య భాష నిర్మూలనతో పాటు గ్రామంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం, ప్రధాన కూడళ్లలో ఉచిత వైఫై సౌకర్యం కల్పించడం వంటి చర్యలు తీసుకున్నారు. ఈ సంస్కరణల ఫలితంగా బోర్సర్ గ్రామం ఇప్పుడు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## మెజీషియన్

తల్లి: "మెజీషియన్‌ను పెళ్లి చేసుకున్నావు.. అతనికి ఏముంది? ఆస్తా, అంతస్థా? ఏముందని?"

కూతురు: "ఆస్తి, అంతస్తులు ఎవరికి కావాలమ్మా? నేను కోరినవన్నీ క్షణాల్లో సమకూరుస్తున్నాడు. అంతకన్నా ఇంకేంకావాలి?'

## రాశిఫలాలు

భర్త: "నా రాశిఫలాల్లో రెండో పెళ్లి వున్నట్లు



రాశారు. నీకు తోడుగా ఓ చెల్లెలు వస్తుందేమో!" అన్నాడు, భార్యతో.

భార్య: "అవునండీ! మీరన్నది నిజమే. జాతకాలు చెప్పేవాళ్లు కరెక్టుగా చెప్తారు. నా జాతకంలోనూ మీకు ఒక తమ్ముడు ఉన్నట్లు రాశారు. బహుశా అది కూడా నిజం కావచ్చేమోనండీ!"

ఇంకేమంటాడు... మారు మాట్లాడలేదు.

– టి.సదాశివరెడ్డి

## జీతం రాదుగా!

అర్చన:"ఏమైంది? అంత విచారంగా వున్నావు?" అంది స్నేహితురాలు రత్నంతో.

రత్నం: "మా ఆయన రేపు జైలు నుండి వస్తున్నాడు" అంది.

అర్చన: "పిచ్చిపిల్లా! దానికి సంతోషించాలిగానీ, ఇలా బాధపడతారా ఎవరైనా?"

రత్నం: "ఆయనకు జైల్లో అన్నీ టైమ్‌కి అందేవి. ఎంచక్కా జీతం కూడా వచ్చేంది కదా!" అదీ నా బాధ.

## ఎవరికీ చెప్పను?

"మీ వీధిలో ఏం జరిగినా నేను ఎవరికీ చెప్పను" విజయ అంది కార్తికతో.

"నిజమా! చాలా సంతోషం" అంది కార్తిక.

"అది సరేకానీ ఎదురింటి లక్ష్మికి లవర్ ఉన్నాడు. నీకు ఆ విషయం తెలుసా?" అడిగింది వెంటనే తను చెప్పిన విషయం మర్చిపోయి.

## అలారం

"డాక్టర్‌గారూ, కిందటి వారం మీరు నాకు ఆపరేషన్ చేసారు. ఆ రోజు నుండి ఉదయం రోజూ అలారం వస్తోంది. ఎందుకంటారు డాక్టర్?" అని అడిగాడు మాధవయ్య.

"ఓ గాడ్! నా మొబైల్ మీ కడుపులో ఉంచి కుట్లేసాను. మరిచిపోయాను" అని డాక్టర్ తల పట్టుకున్నాడు.

## నాకు ఓకే!

"కోడలుపిల్లా! నేను, నా కూతురు ఎవరు వంట చేసినా మీ ఆయనకు నచ్చదు" అంది కొత్త కోడలితో.



"నాకేమీ అభ్యంతరం లేదు అత్తయ్యా! మీ ఇద్దరిలో ఎవరు చేసినా నాకు ఓకే" అంది, చమత్కారంగా, కొత్తకోడలు.

## ట్రాన్స్ ఫర్

"నీపై ఇది ఏడవ కేసు. నేను ఏం చెయ్యాలి? వేరే మార్గం లేదా?" అన్నాడు దొంగతో జడ్జి.

"అయితే సార్ మీరు వేరే కోర్టుకి ట్రాన్స్ ఫర్ చేయించుకోండి" అన్నాడు దొంగ.

## అందమైన కోడలు

"పండూ, ఇంతసేపు దేవుడి దగ్గర ఏమి కోరుకున్నావు?"

"నా కోసం ఏమీ కోరుకోలేదు అమ్మా, నీకు మంచికోడలు రావాలని కోరుకున్నాను" అన్నాడు, పండు తల్లితో.

## గ్యాప్

"అల్లావుద్దీన్, ఈ దీపం నుండి ఎంత రుద్దినా భూతం బయటికి రావడం లేదేంటి?" అన్నాడు సైనుద్దీన్.

"ఓ... అదా! నువ్వు గ్యాప్ అడుగుతావేమోనని బయటికి రావడం లేదు" సమాధానమిచ్చాడు అల్లావుద్దీన్.

## గ్యాస్ ప్రాబ్లమ్

"మమ్మీ, గ్యాస్ ప్రాబ్లమ్ వల్ల హాస్టల్ నుండి ఇంటికి పంపించేశారు" అన్నాడు రవి.

"ఇంత చిన్న వయసులో నీకు గ్యాస్‌నప్రాబ్లమ్ ఏంటిరా? హాస్టల్ వార్డెన్ డాక్టర్‌ను పిలిపించలేదా?" అంది తల్లి.

"అబ్బా! గ్యాస్ అంటే ఆ గ్యాస్ ప్రాబ్లమ్ కాదమ్మా! కుకింగ్ గ్యాస్ ప్రాబ్లమ్ వల్ల హాస్టల్ నుండి అందరికి ఇంటికి పంపించేశారు. స్పెషల్ సెలవులు ఇచ్చారు" అన్నాడు రవి.

– ఈ.ఎస్.మాధవన్

## 'సంఘీ' భావం



# ట్రిపుల్ ఆర్‌కు మోక్షం కలిగేనా?

దూర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలతో పాటు కార్లు, బస్సులు హైదరాబాద్ నగరంలోకి వచ్చి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఓఆర్ఆర్‌కు కొన్ని కి.మీ. దూరంలో రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. అయితే నిధుల కేటాయింపులో జాప్యం జరగడం, కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ సమయంలో స్థానికులు, రైతుల నుంచి ప్రతిఘటన రావడంతో జాప్యం జరుగుతూ వచ్చింది. అయితే ఎట్టకేలకు తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి కొంత మేర నిధులను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు జమ చేయడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కే పరిస్థితి ఏర్పడింది.సుమారు 626 కోట్ల రూపాయలను ప్రభుత్వం తన వంతు వాటాగా అందించింది. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం జమ చేసిన వంద కోట్ల రూపాయలతో ఈ మొత్తం కలిసి ఉంది. ఈ ఆర్ఆర్ఆర్‌ను ఉత్తర భాగంలో 162 కి.మీ., దక్షిణ భాగంలో 201 కి.మీ. నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగ భాగం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ట్రిపులార్ భూసేకరణ కోసం రాష్ట్రప్రభుత్వం తన వంతు వాటా కింద 2560 కోట్ల రూపాయలు ఉత్తర భాగం కోసం వ్యయం చేయడానికి నిర్ణయం తీసుకొంది. హైదరాబాద్ మహానగరం చుట్టూ రీజినల్ రింగు రోడ్డు చౌటుప్పల్ (జాతీయ రహదారి 65), షాద్‌నగర్ (జాతీయ రహదారి 44), సంగారెడ్డి (జాతీయ రహదారి 65) వరకు నిర్మిస్తున్నారు. యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 19 మండలాలకు చెందిన 113 గ్రామాల మీదుగా ఈ రోడ్డు నిర్మితమవుతుంది. జంక్షన్లు మినహా మిగిలిన రోడ్డంతా 100 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరిస్తారు.ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ ఆయా భూముల్లో హద్దురాళ్లను కూడా ఏర్పాటు చేసింది. రూ.9,600 కోట్ల ఖర్చుతో నిర్మించ తలపెట్టిన ఈ రహదారికి 1,900 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది. దీనిని పూర్తిగా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పద్ధతిలో నిర్మిస్తున్నారు. రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగంలో భూసేకరణకోసం సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో శివంపేట, వెండికోలు, లింగంపల్లి, వెంకటకిష్టాపూర్ కోర్పోలు, గ్రామాలతో పాటు, సిద్దిపేట జిల్లాలోని జగదేవపూర్, మర్కూక్ మండలాలు, భువనగిరి మం॥ మినహా మిగిలిన అన్ని మండలాల్లో భూ సేకరణ దాదాపుగా పూర్తి కావచ్చింది. ఈ ట్రిపుల్ ఆర్ సంగారెడ్డి, మెదక్ సిద్దపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల మీదుగా సుమారు 162 కిమీ దూరం నిర్మిస్తున్నారు. శివంపేట, వెండికోలు, లింగంపల్లి, వెంకటకిష్టాపూర్ కోర్పోలులో సుమారు 298.23 ఎకరాల భూములు కోల్పోతున్న 581 మంది రైతులతో అధికారులు చర్చలు జరుపుతున్నారు. ఇందుకు అనుగుణంగా నోటీసులు కూడా జారీ చేయడం జరిగింది. యాదాద్రి జిల్లాలోని భువనగిరి మండలం రాయగిరి, చౌటుప్పల్‌లో 2,588 ఎకరాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లిలో ప్రారంభయ్యే రీజినల్రింగ్ యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా వెళ్తుంది. యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల భూ సేకరణ క్రతువు దాదాపు తుది అంకానికి చేరుకుంది. 290 ఎకరాలు సేకరించి 674 మంది రైతులకు రూ.57 కోట్లు చెల్లించారు. మిగిలిన వారికి పరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు గౌస్నగర్, ఎర్రంబల్లిలో 484 ఎకరాల సేకరణ జరగాల్సి ఉంది. కోర్టు కేసుతో ఆగింది. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినా రైతులు అభ్యంతరం చెప్పడంతో ఆగింది. ప్రస్తుతం కేసారం, పెంచికలపహాడ్‌లో సర్వే పూర్తయ్యింది. అయితే ఆశించిన స్థాయిలో నిర్మాణం పనులు జరగడం లేదు. ముందుగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ప్రతిపాదనలు వచ్చినా అప్పట్లో కేవలం వంద కోట్ల రూపాయలను మాత్రమే చెల్లించ డంతో పనులు ముందుకు సాగలేదు. అదేవిధంగా భూములు సేకరణలోనూ అనేక సమస్యలు తలెత్తాయి. ప్రస్తుతం తాజాగా ట్రిపుల్ ఆర్‌కు సమాంతరంగా రైల్వే లైన్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనితో భూసేకరణ మరింత ఎక్కువ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక దశలో భూసేకరణ పూర్తయితే నిర్మాణం పనులు చేపట్టాలి ఉంటుందిప్రస్తుతం ఓఆర్ఆర్ వల్ల నగరంలో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గింది. ఇక ట్రిపుల్ ఆర్ నిర్మాణం పూర్తయితే మహానగరం మరింతగా విస్తరించడంతో పాటు హైదరాబాద్ మీదుగా దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు కూడా ఎంతో వెసులుబాటు కలుగుతుంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**

కవర్ స్టోరీ

యేచన్ చంద్రశేఖర్

# నిప్పు.. టచ్ చేస్తే ముప్పు



మానవ నాగరికతకు మూలం నిప్పు లేదా అగ్ని అని చెప్పవచ్చు. రెండు లక్షల సంవత్సరాల క్రితం యూరప్‌లో ఆదిమానవుడు నిప్పును కనుగొన్నాడని ఇప్పటి వరకు పరిశోధకులు భావించినప్పటికీ అంతకు 50 వేల సంవత్సరాల పూర్వమే ఆది మానవుడు నిప్పును కనుగొన్నాడని ఒక తాజా అధ్యయనంలో వెల్లడైంది. స్పెయిన్‌లోని చారిత్రక ప్రదేశంలో ఆది మానవుడి నిప్పు వాడకంపై ఆధారాలు లభ్యమైనట్లు స్కాట్లాండ్‌లోని హిరియట్ వాట్ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. నిప్పుతో మానవుడికి పరిచయం ఎప్పుడు ఏర్పడిదందనే విషయమై ప్రపంచవ్యాప్తంగా భిన్న వాదనలున్నాయి. దక్షిణాఫ్రికాలోని ఓ గుహలో జంతు అవశేషాలపై కార్బన్ డేటింగ్ జరపగా, అవి 15 లక్షల ఏండ్ల క్రితం నాటివని తేలింది. రెండు రాళ్లను రాపిడి చేస్తూ నిప్పును పుట్టించటం అనేది తొలిసారిగా 7.9 లక్షల సంవత్సరాల క్రితం ఇజ్రాయెల్‌లో జరిగిందని పురావస్తు అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే నిప్పును నియంత్రిస్తూ కట్టెల్ని కాల్చే ప్రక్రియ ఎప్పుడు మొదలైందన్న దానిపై ఇప్పటివరకూ కచ్చితమైన ఆధారాలు లేవు. అగ్ని సహాయంతో ఆది మానవుడు పచ్చి ఆకులు, అలములు, మాంసం తినడం మానివేసి ఉడికించుకుని తినడం ప్రారంభించి నాగరికత వైపు అడుగులు వేసాడు. అయితే కాలక్రమంలో ఈ నిప్పు ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల అగ్ని ప్రమాదాలకు కారణమై విలువైన ప్రాణాలను ఆస్తులను హరించివేస్తుంది.

## భారతదేశంలో అగ్నిమాపక కేంద్రాల తీరుతెన్నులు

భారతదేశంలో అగ్ని ప్రమాదాలు అత్యంత కీలకమైన సమస్య అయినప్పటికీ తరచుగా ఇది నిర్లక్ష్యం చేయబడుతోంది. ప్రతి సంవత్సరం, నివారించగల అగ్ని ప్రమాదాల కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు, సమాజాలు తీవ్రమైన నష్టాలను చవిచూస్తున్నాయి. సాంకేతికత, పట్టణ ప్రణాళికలో పురోగతి సాధించినప్పటికీ, అగ్ని ప్రమాదాల నుండి భద్రతా పరంగా తగినంత నిరంతర శ్రద్ధ మాత్రం లభించడం లేదు. భారతదేశంలో అధికారికంగా 3,200కు పైగా అగ్నిమాపక కేంద్రాలు మాత్రమే ఉన్నాయి.

అయితే, ప్రపంచ స్థాయి భద్రతా ప్రమాణాలను అందుకోవడానికి మనకు వాస్తవానికి 18,000కు పైగా అగ్నిమాపక కేంద్రాలు అవసరమని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీఎన్డిఎంఎ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ అంచనా ప్రకారం దేశంలో 80 శాతం అగ్నిమాపక కేంద్ర కొరత ఉంది. ప్రపంచ ప్రమాణాల ప్రకారం ఒక్కో అగ్నిమాపక కేంద్రం 50,000 మంది జనాభాకు మాత్రమే సేవలందించాల్సి ఉండగా ఆశ్చర్యకరంగా కొన్ని నగరాల్లో ఒక అగ్నిమాపక కేంద్రం కేవలం 10 నుండి 15 లక్షల మంది జనాభాకు మాత్రమే సేవలందిస్తోంది. మన దేశంలో ప్రతి 2 నిమిషాలకు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు లేదా సంబంధిత అత్యవసర పరిస్థితుల కారణంగా ఒక పౌరుడు మరణిస్తున్నాడు.

అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర సహాయం కోసం 101కి (దేశవ్యాప్తంగా ఇప్పుడు పోలీస్, అగ్నిమాపక దళం, అంబులెన్స్ సేవల కోసం ఏకైక సమీకృత నంబర్ 112) ఫోన్ చేస్తే ఘటనాస్థలికి సమీపంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడం, ఉంటే నీటి సరఫరా వాహనాలు అందుబాటులో లేకపోవడం, ఒకవేళ ఉన్నా స్పందించడానికి తగినంత సిబ్బంది లేకపోవడం లాంటి పరిస్థితి ఉంటుంది. ఇది కేవలం గణాంకాలు మాత్రమే కాదు.. కఠోర సత్యాలు అని చెప్పడానికి గుజరాత్ రాష్ట్రం సూరత్‌లోని సర్థానా ప్రాంతంలో 24 మే 2019న తక్షశిల కాంప్లెక్స్‌లోని మూడవ, నాలుగవ అంతస్తులలో ఉన్న ఒక కోచింగ్ సెంటర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 22 మంది విద్యార్థులు (ఎక్కువగా టీనేజర్లు) “ఊపిరాడక లేదా కాంప్లెక్స్ నుండి దూకి” మరణించడం, 8 డిసెంబర్ 2019న..

ఢిల్లీని సదర్ బజార్‌లోని జనసాంద్రత అధికంగా ఉన్న అనాజ్ నుండి ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సందర్భంలో సంభవించబోయే విపత్తు గురించి ఏమాత్రం తెలియకుండా నిద్రపోతున్న కూలీలు 45 మంది ప్రాణాలు కోల్పోవడం, 26 మే 2024న రాజ్‌కోట్‌లో తాత్కాలికంగా ఇనుప రేకులతో ఏర్పాటు చేసిన ఒక ఆటల జోన్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో కనీసం 33 మంది మరణించడమే సజీవ సాక్ష్యాలు.

## అగ్నిప్రమాదాల కారణాలు

భారతదేశంలో అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, గ్యాస్ లీకేజీలు, నిర్లక్ష్యం, అగ్నిమాపక నిబంధనలను పాటించకపోవడం. పాత విద్యుత్ వైరింగ్, ఓవర్ లోడ్, నిర్లక్ష్యంగా సిగరెట్లు పారేయడం, పారిశ్రామిక రసాయనాల నిల్వలు వంటి అంశాలు ముఖ్యమైనవి. వేసవి కాలంలో మండే స్వభావం ఉన్న వస్తువుల వల్ల ప్రమాదాలు పెరుగుతాయి.గృహాలలో, కార్యాలయాలలో, ఆసుపత్రులలో పాత వైరింగ్, నాణ్యత, సరైన భద్రతా ప్రమాణాలు లేని పరికరాల వాడకం, మోతాదుకు మించి విద్యుత్ వినియోగం (ఓవర్ లోడ్) కారణంగా జరిగే షార్ట్ సర్క్యూట్‌లు 89 శాతం వరకు అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉజ్వల పథకం ద్వారా గృహావసరాల కోసం వంట గ్యాస్ వినియోగం కూడా గణనీయంగా పెరిగింది. 2012లో 15 మిలియన్ మెట్రిక్ టన్నులు ఉన్న గృహ వంటగ్యాస్ వినియోగం రెట్టింపై 2025 నాటికి 30 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగింది. గృహిణుల అవగాహనా రాహిత్యం, నిర్లక్ష్యం, స్టవ్ ఆఫ్ చేయకపోవడం, గ్యాస్ లీక్ అవ్వడం, నాణ్యత లేని గ్యాస్ పైపుల వాడకం వల్ల మంటలు తరచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అని తేడా లేకుండా వేగవంతమైన, సౌకర్యవంతమైన జీవితాలకు అలవాటు పడిన ప్రజలు లెక్కకు మించి విద్యుత్ గృహోపకరణాలను వినియోగించినప్పటికీ వాటి నాణ్యత, భద్రతాప్రమాణాలపై దృష్టి సారించకపోవడం, అగ్ని ప్రమాద సమయాల్లో అవసరమయ్యే కనీస అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోకపోవడం వలన అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది. ఇందుకు తోడు ధూమపానం అలవాటు ఉన్నవారు బాధ్యతారాహిత్యంగా వెలిగించిన సిగరెట్లు నిర్లక్ష్యంగా పారేయడం, అవసరం పూర్తయిన తరువాత కూడా విద్యుత్ ఉపకరణాలను స్విచాఫ్ చేయకుండా అలాగే వదిలేయడం.. లాంటివి కూడా ప్రమాద హేతువులే.

## గణాంకాలు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) డిసెంబర్ 2025 నివేదిక ప్రకారం, భారతదేశంలో ఏటా సుమారు 1 లక్షా 60 వేల అగ్నిప్రమాదాలు నమోదవుతున్నాయి.

**2016 నుండి 2022 వరకు సంభవించిన అగ్ని ప్రమాదాల వివరాలు**

| సంఘటనా స్థలం | 2016 | 2017 | 2018 | 2019 | 2020 | 2021 | 2022 |
|---|---|---|---|---|---|---|---|
| నివాస ప్రాంతాలు | 8478 | 7614 | 7208 | 6329 | 5248 | 4240 | 3979 |
| వాణిజ్య సముదాయాలు | 459 | 382 | 284 | 330 | 163 | 233 | 219 |
| పరిశ్రమలు | 168 | 216 | 177 | 177 | 107 | 67 | 88 |
| ఆటోమొబైల్స్ | 369 | 277 | 438 | 152 | 326 | 194 | 86 |
| ప్రభుత్వ భవనాలు | 41 | 10 | 18 | 54 | 57 | 29 | 38 |
| పరిశ్రమలు (మండే/పేలుడు స్వభావ ఉత్పాదనలు, టపాసులు, వగైరా.) | 306 | 72 | 71 | 33 | 13 | 96 | 66 |
| పాఠశాల భవనాలు | 41 | 10 | 18 | 54 | 57 | 29 | 38 |
| అగ్ని ప్రమాదాలు | 6 | 8 | 6 | 7 | 5 | 1 | 1 |
| గనులు | 28 | 26 | 14 | 2 | 0 | 7 | 2 |
| ఇతరులు | 7026 | 4551 | 4522 | 3803 | 3186 | 3478 | 2955 |

**2016 నుండి 2019 వరకు భారతదేశంలో అత్యధిక అగ్ని ప్రమాదాలు, మరణాలు సంభవించిన రాష్ట్రాల వివరాలు**

| రాష్ట్రం | 2016 | 2017 | 2018 | 2019 |
|---|---|---|---|---|
| మధ్యప్రదేశ్ | 2368 | 1812 | 1986 | 1467 |
| మహారాష్ట్ర3069 | 2230 | 1896 | 1456 | |
| ఒడిశా | 897 | 971 | | |
| కర్నాటక | 1271 | 1007 | ... | 854 |
| గుజరాత్ | 1833 | 1314 | 1194 | 763 |
| ఛత్తీస్‌గఢ్ | | | 976 | |
| తమిళనాడు | | 936 | | |
| ఉత్తర ప్రదేశ్ | 1356 | | | |

(ఆధారం: నేషనల్ క్రైమ్ రిపోర్ట్స్ బ్యూరో నివేదికలు)



వీటి ఫలితంగా 27,000 మందికి పైగా మరణిస్తున్నారు. ఇది ప్రమాద మరణాలకు ఒక ప్రధాన కారణంగా నిలుస్తోంది. మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ వంటి అధిక జనసాంద్రత గల రాష్ట్రాలు; ఆసుపత్రులు, కర్మాగారాల వంటి వాణిజ్య కేంద్రాలలో పెరుగుతున్న ప్రాణనష్టం ఈ గణాంకాలలో అధికంగా ఉంటున్నాయి. అగ్నిప్రమాద మరణాలలో సగానికి పైగా (సుమారు 57శాతం) నివాస ప్రాంతాలలో సంభవిస్తున్నాయి. అగ్నిప్రమాద సంబంధిత మరణాలలో 50 శాతం పైగా మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లలోనే సంభవిస్తుండడం గమనార్హం. అధిక జనసాంద్రత, వేగంగా పట్టణీకరణ జరుగుతున్న ప్రాంతాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం అధికంగా ఉండడంతో పాటు అధిక మరణాల రేటు కూడా ముడిపడి ఉంది. ముఖ్యంగా రాత్రి సమయాలలో సాధారణంగా అందరూ గాఢ నిద్రలో ఉన్నప్పుడు మరణాలు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని విశ్లేషణలలో అగ్నిప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయని కొన్ని నివేదికలు సూచిస్తున్నప్పటికీ, విద్యుత్ సమస్యలు లేదా ప్రమాదకరమైన భవన నిర్మాణ సామగ్రి వినియోగం, తరలింపు వంటి కారణాల వల్ల సంభవిస్తున్న భారీ సంఖ్యలో మరణాలు ఇప్పటికీ అత్యవసరంగా దృష్టి సారించాల్సిన ప్రధాన అంశంగా నిలుస్తున్నాయి.

2015 నుండి 2025 అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తే భారతదేశంలో ఏటా సుమారు 1.6 లక్షల అగ్నిప్రమాదాలు నమోదవుతున్నప్పటికీ, గత దశాబ్దంలో నమోదైన మొత్తం అగ్నిప్రమాదాల సంఖ్య తగ్గింది. 2022లో నమోదైన సంఘటనలు (7,566 కేసులు), మరణాలు గత 25 యేళ్లలో కనిష్ట స్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం వాణిజ్య భవనాల్లో జరిగిన అగ్నిప్రమాదాల్లో 2019లో 330, 2020లో 163, 2022లో 241 మరణాలు సంభవించగా 2023లో సంభవించిన మొత్తం అగ్నిప్రమాద మరణాలలో 3.5 శాతం వాటాతో, వాణిజ్య భవనాలు రెండవ అత్యంత ప్రాణాంతకమైన ప్రదేశంగా నిలిచాయి. వీటిలో జార్ఖండ్, బీహార్ మరియు తమిళనాడులలో గణనీయమైన సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. ఉత్పత్తులు, పండ్లు కూరగాయలు, ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర సరుకులను నిల్వ చేసేందుకు శీతల గిడ్డంగుల (కోల్డ్ స్టోరేజెస్) వినియోగం కూడా భారీగా పెరిగింది. భారత ప్రభుత్వ పత్రికా సమాచార కార్యాలయం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ప్రకారం జూన్ 30, 2025 నాటికి 40.22 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను భద్రపరచడంలో సహాయపడేందుకు భారతదేశంలో 8,815 శీతల గిడ్డంగులు ఉన్నాయి. సాధారణంగా విద్యుత్ వినియోగం అధికంగా ఉండే ఈ శీతల గిడ్డంగులలో షార్ట్ సర్క్యూట్‌ల వల్ల అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయి. 2025 సంవత్సరం నివేదికల ప్రకారం, భారతదేశంలోని శీతల మరియు గిడ్డంగులలో (సమగ్రమైనది కానప్పటికీ), గణనీయమైన సంఖ్యలో అగ్నిప్రమాదాలు జరిగాయి.

## శీతల, సాధారణ గిడ్డంగుల సంఘటనలు

ఆగస్టు 6, 2025న తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, అన్నారం గ్రామంలోని గుబ్బ కోల్డ్ స్టోరేజ్ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం సంభవించి, కొన్ని గంటలపాటు కొనసాగి అనేక పేలుళ్లకు కారణమైంది. ఈ దుర్ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, ఈ కేంద్రాలతో ముడిపడి ఉన్న అధిక ప్రమాదాలను ఈ సంఘటన వెలుగులోకి తెచ్చింది. తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, మధిర సమీపంలోని సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు 28,000 మిరపకాయల బస్తాలు ధ్వంసమయ్యాయి, దీనివల్ల దాదాపు రు.15 కోట్ల నష్టం వాటిల్లినట్లు మార్చి 2026లో నివేదించబడింది.

2025లో మధ్య, పశ్చిమ భారతదేశం అంతటా అనేక సాధారణ గోదాములు, వాణిజ్య నిల్వ కేంద్రాలలో అగ్నిప్రమాదాలు నమోదయ్యాయి. ఈ అగ్నిప్రమాదాలు గణనీయమైన ఆస్తి నష్టానికి దారితీశాయి. దర్యాప్తు నివేదికలలో అగ్నిమాపక భద్రతా పరికరాలు లేకపోవడం లేదా సరైన నిర్వహణ లేకపోవడం వంటివి తరచుగా కారణాలుగా పేర్కొన్నారు. 2020లో 1,943; 2023లో 1,780 సంఘటనలు జరిగినట్లు గణాంకాలు చూపిస్తున్నాయి. అదే సమయంలో అగ్నిప్రమాదలకు ఇతర కారణాలు (గోదాములు, గిడ్డంగుల నిర్వహణ శాస్త్రీయ పద్ధతిలో లేకపోవడం, వస్తువులను సక్రమమైన పద్ధతిలో నిల్వ చేయకపోవడం వంటివి)కూడా భారీగా దోహదపడుతున్నాయి. 2016-2020 మధ్య కాలంలో వ్యాపార సంస్థలు, పాఠశాలలు, ఇళ్లలో జరిగిన అగ్నిప్రమాదాల్లో ప్రతిరోజూ సగటున 35 మంది మరణించారని తెలిస్తే వెన్ను జలదరిస్తుంది.

## దేశవ్యాప్తంగా అగ్నిమాపక కేంద్రాలు

2026 సంవత్సరం ఆరంభం నాటికి, భారతదేశంలో దేశవ్యాప్తంగా 3,200కు పైగా పనిచేస్తున్న అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. అయినప్పటికీ, భద్రతా ప్రమాణాలను అందుకోవడానికి వీటిని గణనీయంగా విస్తరించాల్సిన

అవసరం ఉందని గణాంకాలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడానికి దేశానికి 18,000కు పైగా అగ్నిమాపక కేంద్రాలు అవసరం కాబట్టి, భారీ విస్తరణ అవసరమని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) సూచిస్తోంది. ఈ జాతీయ లక్ష్యసాధనలో భాగంగా భారత ప్రభుత్వం, 'రాష్ట్రాలలో అగ్నిమాపక సేవల విస్తరణ, ఆధునీకరణ పథకం' కింద 28 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడమే కాక 10 ఫిబ్రవరి, 2026 నాటికి దీనికి సంబంధించిన ప్రధాన నిధులు కూడా విడుదల చేసింది. నిధులు ఉన్నప్పటికీ, ముఖ్యంగా మహారాష్ట్ర, రాజస్థాన్, బీహార్ వంటి అధిక జనసాంద్రత గల ప్రాంతాలలో అనేక రాష్ట్రాలు ఇప్పటికీ అగ్నిమాపక కేంద్రాలు, ట్రక్కుల కొరతను ఎదుర్కొంటున్నాయి. 2023లో ఆమోదించబడిన 'రాష్ట్రాలలో అగ్నిమాపక సేవల విస్తరణ, ఆధునీకరణ పథకం' కింద కొత్త స్టేషన్ల నిర్మాణానికి, పాత వాటిని ఆధునీకరించడానికి, మొత్తం రు.5,000 కోట్ల కేటాయింపుతో చురుకుగా నిధులు సమకూరుస్తోంది.

## తెలంగాణలో పరిస్థితి

ప్రస్తుతం రాష్ట్రంలో 138 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయని, ప్రతి జిల్లాలో తొమ్మిది ఉపకేంద్రాలు (అవుట్ పోస్ట్) ఉన్నాయని, మొత్తం 544 అగ్నిమాపక వాహనాలు ఉన్నాయని ఆయన తెలిపారు. 2025లో రాష్ట్రంలో 8,861 అగ్ని ప్రమాదాలు సంభవించగా, మొత్తం 163 మంది మరణించారని మంత్రి ఈ యేడాది జనవరి 6న రాష్ట్ర శాసనసభలో తెలిపారు. అంతేకాకుండా, రు.879 కోట్ల విలువైన ఆస్తి నష్టం కూడా సంభవించిందని ఆయన తెలిపారు. శాసనసభ శీతాకాల సమావేశాల సందర్భంగా అగ్నిమాపక శాఖపై జరిగిన చర్చ సందర్భంగా, ఈ సంవత్సరంలో రాష్ట్రంలో చోటు చేసుకున్న రెండు అతిపెద్ద విషాదాలను మంత్రి ప్రస్తావించారు. మొదటి అగ్నిప్రమాదం జూన్ 30, 2025న తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా, పాశమైలారంలోని సిగాచి ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీలో స్ప్రే డ్రైయర్ యూనిట్‌లో పేలుడు సంభవించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ దుర్ఘటనలో 46 మంది వరకు మరణించినట్లు, 33 మంది గాయపడినట్లు తెలిసింది. ఈ సంఘటన పనివేళల్లో జరగడంతో భారీ ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. రెండవ అగ్నిప్రమాదం మే 18, 2025 ఉదయం హైదరాబాద్‌లో చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌజ్ వద్ద సంభవించింది.ఈ ఘోర అగ్నిప్రమాదంలో ఒక నివాస భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగి ఊపిరి సలపకపోవడంతో భారీ ప్రాణ నష్టం జరిగింది. ఈ హృదయవిదారక ఘటనలో కేవలం ఏడు సంవత్సరాల లోపు ఎనిమిది మంది పిల్లలు, ఆరుగురు మహిళలతో సహా ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మరణించారు. దుర్ఘటన అనంతరం 11 అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించారు. ఆ ప్రాంతంలో జనసాంద్రత ఎక్కువగా ఉండటం, భవనానికి ఉన్న ఒకే ఒక ఇరుకైన ప్రవేశ ద్వారం వల్ల తప్పించుకోవడం కష్టంగా మారడంతో ఈ ఘటన తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. మరో దుర్ఘటన 24 జనవరి 2026న హైదరాబాద్, నాంపల్లి ప్రాంతంలోని ఒక ఫర్నిచర్ దుకాణం బేస్‌మెంట్‌లో నిల్వ ఉంచిన సామాగ్రి నుండి దట్టమైన పొగ వెలువడటంతో, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఊపిరాడక ఐదుగురు మరణించారు. మృతులలో 7-11 సంవత్సరాల బాలల సహా ఐదుగురు ఉన్నారు. ఫర్నిచర్ సామాగ్రిని అక్రమంగా నిల్వ చేయడానికి సెల్లార్‌ను ఉపయోగిస్తున్నారని, కార్మికులు అక్కడే నివసిస్తున్నారని నివేదికలో తేలింది. అంతేకాదు, ఇటీవల హైదరాబాద్‌లోని స్క్రాప్ గోదాములు, వాణిజ్య సంస్థలలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నట్లు నివేదికలు అందడం భద్రతా పరమైన ఆందోళనలను ఎత్తి చూపుతోంది. ఈ సంఘటనలు తరచుగా నివాస, వాణిజ్య



సముదాయాలుగా ఉన్న భవనాలలో జరుగుతుండడంతో గణనీయమైన ప్రాణనష్టం సంభవిస్తోంది. మరోపక్క వివిధ కర్మాగారాలు, కెమికల్ ప్లాంట్లలో మండే స్వభావం ఉన్న రసాయనాలను అశాస్త్రీయంగా నిల్వ చేయడం వల్ల రియాక్టర్ పేలుళ్లు, పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి.

భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్ ప్రకారం అగ్నిమాపక భద్రత అనేది రాష్ట్ర పరిధిలోని అంశం. కాబట్టి, అగ్నిమాపక సేవలను ఏర్పాటు చేయడం, ఈ నిబంధనలను అమలు చేయడం ఆయా రాష్ట్రాల బాధ్యత. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు భారత ప్రభుత్వం భారతదేశ జాతీయ భవన నిర్మాణ నియమావళి (నేషనల్ బిల్డింగ్ కోడ్ ఎన్‌బిసి) 2016ను రూపొందించింది. ఇది బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) అభివృద్ధి చేసిన ఒక సమగ్రమైన, స్వచ్ఛంద సాంకేతిక మార్గదర్శక పత్రం (కోడ్/ప్రమాణం) మాత్రమే. ఇది పార్లమెంట్ ద్వారా ఆమోదం పొందిన చట్టం కాదు.

దీనిని నిర్దిష్ట రాష్ట్రస్థాయి భవన ఉపచట్టాలలో లేదా అగ్నిమాపక సేవా చట్టాలలో చేర్చినప్పుడు మాత్రమే దీనికి చట్టబద్ధత ఏర్పడుతుంది. ఈ మార్గదర్శక పత్రంలో అగ్ని నిరోధక నిర్మాణం, అలారాలు..

అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి అంశాలపై అనుసరించవలసిన సూచనలు పొందుపరచబడ్డాయి. మోడల్ బిల్డింగ్ బై లాస్ 2016ను అమలు చేయడం, క్రమం తప్పకుండా అగ్నిమాపక భద్రతా తనిఖీలు నిర్వహించడం, ప్రమాదకర పదార్థాలను నియంత్రించడానికి పెట్రోలియం అండ్ ఎక్స్ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (PESO)కు అధికారం ఇవ్వడం వంటి కీలక చర్యల ప్రస్తావన కూడా ఇందులో ఉంది. అగ్ని నివారణ, అగ్నిమాపక భద్రతా చట్టం, 2005, మోడల్ బిల్ 2019, రాష్ట్రాలు అగ్నిమాపక సేవలను నిర్వహించడానికి భద్రతా నియమాలను అమలు చేయడానికి ఒక చట్టపరమైన వ్యవస్థను అందిస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఆధునిక వాహనాలు పరికరాలపై దృష్టి సారిస్తూ, రాష్ట్ర అగ్నిమాపక సేవలను ఆధునీకరించడానికి 2023లో రు.5,000 కోట్ల పథకాన్ని ప్రారంభించింది.

**పారిశ్రామిక/ప్రమాదకర భద్రత:** పదార్థాల నిర్వహణ, నిల్వ, రవాణాను పెట్రోలియం అండ్ ఎక్స్ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (PESO) కఠినంగా నియంత్రిస్తుంది. ఫ్యాక్టరీల చట్టం (సెక్షన్ 38) పారిశ్రామిక ప్రాంగణాలకు అగ్నిమాపక భద్రతా ప్రణాళికలను తప్పనిసరి చేస్తుంది. జనసాంద్రత అధికంగా ఉండే భవనాలు థర్డ్పార్టీ వార్షిక అగ్నిమాపక భద్రతా తనిఖీలు నిర్వహించడంతో పాటు క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ (విపత్తు సమయంలో ఆపద నుండి తప్పించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను ప్రాక్టికల్గా చూపించడం) నిర్వహించాలి. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్డిఎంఏ) ఆసుపత్రులతో సహా ప్రభుత్వ భవనాలకు విపత్తు సమయాలలో తరలింపు భద్రతకు సంబంధించి కఠినమైన మార్గదర్శకాలను నిర్దేశిస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, స్థానిక అగ్నిమాపక సంస్థలు సంయుక్తంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21-25 వరకు నిర్వహించే వార్షిక అగ్నిమాపక భద్రతా వారోత్సవాలలో అవగాహన కల్పిస్తాయి.

## నియమ నిబంధనల ఉల్లంఘనలు

వాణిజ్య నిర్మాణాలలో ప్రామాణికమైన భవన నిర్మాణ సామాగ్రి ఉపయోగించకపోవడంతో అవి దుర్బలత్వంతో ఉండడం, భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ నిర్మాణంలోని ప్రతి అంగుళాన్ని వినియోగించుకోవాలన్న దురాశతో సంబంధిత మున్సిపాలిటీలు లేదా స్థానిక సంస్థలు సూచించిన సెట్ బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించడం, భవన నిర్మాణ అనుమతికి మించి ఎక్కువ అంతస్తులు నిర్మించడం, వాణిజ్య సముదాయాలు మరియు బహుళ అంతస్తుల భవనాలలో అగ్నిమాపక ఉపకరణాలను అందుబాటులో ఉంచకపోవడం లేదా ఉన్నా వాటి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, విపత్తులు సంభవించినప్పుడు భవనం నుండి సురక్షితంగా తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడం, విపత్తు సమయాలలో అగ్నిమాపక దళం దుర్ఘటనా స్థలానికి సకాలానికి చేరుకునేందుకు అనువైన రోడ్లు లేకపోవడం, ఇరుకు సందులలో కూడా బహుళ అంతస్తులు, వాణిజ్య సముదాయాలు నిర్మించడం వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎత్తైన భవనాలలో, అధిక జనసంచారం ఉండే వాణిజ్య కేంద్రాలలో (గేమింగ్ జోన్లు, మాల్స్) అంతర్గత రూపకల్పనలో మండే పదార్థాలు, రద్దీగా ఉండే ప్రదేశాల కారణంగా అధిక మరణాల సంఘటనలు సర్వసాధారణంగా మారుతున్నాయి.

దేశంలోని మొత్తం అగ్నిప్రమాద సంబంధిత మరణాలలో 50 శాతం కంటే ఎక్కువ సంఘటనలు మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ వంటి పారిశ్రామిక, అధిక జనసాంద్రత గల రాష్ట్రాలలో సంభవిస్తున్నాయి. సాధారణ ఉల్లంఘనలతో పాటు



అగ్నిమాపక శాఖల నుండి నిరభ్యంతర పత్రాలు (నో అబ్జెక్షన్) లేకపోవడం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు తాళం వేసి ఉండటం, సరిపోని అగ్నిమాపక పరికరాలు ఉండటం వంటివి దర్యాప్తులలో తరచుగా బయట పడుతున్నా, నియమ నిబంధనల అమలులో నిర్లిప్తత కొనసాగుతూనే ఉంది.

## విపత్తు సమయాలలో స్కౌట్స్, గైడ్స్ సేవలు

లార్డ్ బెడెన్ పావెల్ ద్వారా 1907లో ఇంగ్లాండ్లో స్కౌట్స్ ఉద్యమం ప్రారంభించబడగా, భారతదేశంలో ఇది 1909లో వారి కోసం స్థాపించబడినప్పటికీ, 1913 నుండి జస్టిస్ వివియన్ బోస్, మదన్ మోహన్ మాలవ్య, హృదయనాథ్ కుంజ్రూ, అన్నీ బీసెంట్, జార్జ్ అరుండేల్ వంటి ప్రముఖ నాయకుల కృషి ద్వారా ఇది స్థానిక భారతీయులకు విస్తరించింది.

1950లో ఏకీకృత 'భారత్ స్కౌట్స్, గైడ్స్' సంస్థ స్థాపించబడింది. బాల్యం నుండే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ఆట-పాటల ద్వారా శిక్షణ అందించే ఈ సంస్థ ద్వారా 'విపత్తు నిర్వహణ'లో భాగంగా స్కౌట్స్, గైడ్స్కు అగ్ని ప్రమాదాల సహా ఇతర విపత్తు సమయాలలో అందించాల్సిన సేవ గురించి అవగాహన కల్పిస్తారు. 'బీ ప్రిపేర్డ్' లేదా 'సర్వం సన్నద్ధం' అన్నది వీరి నినాదం. ఇది కాకుండా గతంలోనూ సివిల్ డిఫెన్స్ అనే కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ఫిజికల్ ఎడ్యుకేషన్లో బాగంగా ఇలాంటి శిక్షణ పొందేవారు.

## ఈ వారం కవిత్వం

# భూపత్రంపై హలం.. కలం

భూమి పైన హలం కదిల్చి
కవిత్వాన్ని రైతన్న సాగు చేసి
సతతం సంతకం చేస్తే గానీ
క్షుద్బాధ అనందమై
పరవశించదు
అహర్నిషలు అన్నం ఎదురుగా
పళ్ళేరంలో అందరికీ
పంచాలనే
తాపత్రయమతడిది...
వెలుగు ప్రవాహ కాలువల
సాయంతో
నేల మీద పచ్చపంటల్ని
రాసెడి కలం,
ఆదిత్యుడి కిరణాల్ని ఆకుల్లో బంధించి
పచ్చని పొలాల కాంతి తెరలు తాగే కవి కదా తను



కవికోకిల
అణచిన అనగవలె ఆకలి
తన చేతిలో అక్షరాలు కురిసే వాన
స్వప్నాలకి ప్రతి గృహాన్నీ
సంధానపరచేవాడు
ఎరువులా భక్తి, విత్తులా నమ్మకం
శ్రమకి రూపురేఖల్నిచ్చిన హస్తం
అదే అతని కవిత్వం జీవన గీతం
సారమైన మట్టి వాసనతో
పరిమళించెను కవనం
రైతన్న పంటే కవిత్వం, పండే జీవితం
ఆలోచనల ఆకలి తీర్చే యధార్థం
అసమాన ధైర్యంతో, కష్టసుఖాలతో
పరిమళించెదు గీతమై...

– డా. చిట్యాల రవీందర్

# ఊగిసలాటలు

ఉయ్యాల ఊగుచున్నది
బాల్యపు బంగారు జ్ఞాపకాలు
బాలల నవ్వుల్లా మెల్లమెల్లగా.
చెట్టు ఊగుచున్నది
గాలికి గీతాలాపన చేస్తూ
ఆకుల తాళాలతో
ప్రకృతినృత్యంలా.
మనసు ఊగుచున్నది
ఆశల అంచులపై ఆగిపోని అలలై
ఆనందం-ఆవేదనల నడుమా.
చెయ్యి ఊగుచున్నది
స్నేహాల సందేశమై
సంతోషాల సవ్వడిలా.
త్రాసు ఊగుచున్నది
న్యాయా న్యాయాల నడుమ
నిజాల నిటారుదారిలా.
తల ఊగుచున్నది



అంగీకారాల
అక్షరమై
అభిప్రాయాల
ఆత్మస్వరంలా.
కాలం
ఊగుచున్నది
గతం-
వర్తమానం
మధ్య
జ్ఞాపకాల స్రవంతిలా.
కలలు ఊగుచున్నవి
నిజాల నెరవేర్పు దారిలో
ఆశల ఊయలపై ఊపులా.
ఊగుతూ నేర్చుకునేదే జీవితము
సమతుల్యం సొంతం చేసుకునేదే
విజయము,
అలలతో ఆడుకునేదే ఆనందము..

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్

# మనుగడ సాగించాలంటే..!

నిన్న
కురిసిన
వానలో
గువ్వలు ఒక్కొక్కటిగా
ఎగిరి వస్తున్నాయి
ఆకలి మంటల్ని చల్లార్చుకోవడానికి
నాలుగు గింజల కోసం వెతుకుతూ
ఆకాశం అంచులదాకా ప్రయాణిస్తూ
భూగోళాన్ని జల్లెడ పడుతున్నాయి
హడలెత్తించే హోరుగాలిని
పరిగెత్తించే వడగండ్ల
వాన దాడిని
తట్టుకుంటూ
అవిశ్రాంతంగా అన్వేషిస్తున్నాయి
వానను సైతం లెక్కచేయని
వాటి సంకల్పబలం
ఎంత గొప్పదో కదా...!
మనుగడ సాగించాలంటే
ఏ జీవికైనా కష్టం తప్పదు మరి..

– నెల్లుట్ల సునీత

# స్నేహబంధం

స్నేహ బంధం
మనసుల మమతల బంధం
పిలుపులో ప్రేమ
మాటలో మాధుర్యం
మనసులో మమత
అవగాహన ఆర్ద్రత
అభిమానం ఆప్యాయత
బంధంలో అనుబంధం
అదే స్నేహబంధం.
విభేదాలు ఎన్ని వున్నా
విడిపోని బంధం స్నేహబంధం
ఎల్లలు ఎరుగనిది
కల్లలు కలహాలు కోరనిది
మమత మానవీయత
తోటలో స్నేహ పుష్పాలను
పెంచుదాం.
ఆత్మీయత అభిమానం
ఆప్యాయత అనురాగం
అనే దారంతో స్నేహమనే
మాలను ధరించి
సహనం సంయమనం
త్యాగం సంఘీభావం
సౌభ్రాతృత్వం సమానత్వం
అనే బాటలో పయనిద్దాం
సమాజ ప్రగతి పురోగతికి
పాటుపడుదాం.

– నేదునూరి కనకయ్య



## సింగిల్ పేజీ కథ

# కేరాఫ్ ఫ్లాట్

**ఆదివారం కదా అని.. వాకింగ్ కోసం నింపాదిగా మెట్లు దిగితూ వెళ్తుంటే, "సార్! 508 ఆయన రాత్రి చనిపోయారు సార్, లిఫ్ట్‌లో వెళ్ళిపోండి సార్, కిందన సెల్లార్‌లో స్టెప్స్ పక్కనే శవం పెట్టారు" అన్నాడు, రెయిలింగ్స్ తుడుస్తున్న వాచ్ మెన్.**

రాత్రి చనిపోతే పొద్దున్నే ఎనిమిదింటి వరకూ మాకు తెలియలేదే? అని లోలోపలే అనుకుంటూ–

"అయ్యో ఎమయ్యిందని?" అడిగా. నేను ఏదో ఫార్మాలిటికి అడగాలిగా అడిగానన్నట్టు..

నా మొహం చూడకుండానే "హార్ట్ ఎటాక్ అంట సార్, ఓలా బుక్ చేసేలోపే, కాలం చేసేసారంట సార్" అంటూ వేగంగా తుడుచుకుంటూ కిందకి పోతున్నాడు.

ప్రతి ఆదివారం, స్టెప్స్ రెయిలింగ్స్ తుడవడం వాడి డ్యూటీ. ఏది ఏమైనా వాడి తొందర వాడిది. వాడైనా పొద్దున్నుంచి ఎంత మందితోనని, ఎమోషనల్‌గా షేర్ చేసుకుంటాడు.

రోజూ చూస్తున్నా.. తనకి ఏమీ కాని ఒక వ్యక్తి చావు గురించి అని అనుకుంటూ వెనక్కి మెట్లెక్కి ఇంటికి వచ్చేసాను.

ఫ్లోర్‌కి ఎనిమిది చెప్పునా, నలభై ఫ్లాట్లు ఉండే గేటెడ్ కమ్యూనిటీలో మాదే చిన్న అపార్ట్‌మెంట్. నా చిన్నప్పుడు మా పల్లెలో కూడా ఇంచు మించూ ఇన్నే ఇళ్లునఉండేవి. కాకపోతే అక్కడ బంధాలు కాంక్రీట్‌తో కట్టినవి, ఇక్కడ గోడలు. అంతే తేడా! అని అనుకుంటూ–

మా ఆవిడతో "508 ఆయన చనిపోయారట, పద.. కిందికి కెళ్ళి పరామర్శించి వద్దాం" అన్నాను.

"అయ్యో! ఎలా జరిగింది?" అని ఆవిడా అడిగింది,

వాచ్ మెన్ చెప్పిందే నేనూ చెప్పాను. లోతుగా ఆలోచిస్తే అంతా మెకానికల్‌గా జరిగిపోతున్నట్టే ఉందిగానీ, ఎక్కడా ఏమాత్రం ఎమోషన్ కనిపించినట్టు నాకు అనిపించటంలేదు.

దిగుతున్నప్పుడు దారిలో మా ఆవిడ, "వాళ్ళు 404 వాళ్ళతో కొంచం సాన్నిహిత్యంగా ఉండే వారండి. పాపం.. సమయానికి వాళ్ళు కూడా ఊళ్ళో లేరు, టూర్ వెళ్ళారు. అప్పుడప్పుడు, 308 ఆవిడ, ఈవిడ పార్కులో కలిసి వాకింగ్ చేయడం చూసనండి. ఆవిడైనా పాపం తోడుగా ఉందో లేదో!" అంటూ నాతో మాట్లాడుతూ వస్తోంది కిందకి లిఫ్ట్‌లో.

శవం పక్కన దిగులుగా వాళ్ళ ఆవిడ ఉంది. కన్నీళ్ళు లోలోపలే దిగమింగుతున్నట్టుంది, గట్టిగా ఏడ్చే హక్కు కూడా లేదు ఈ అపార్ట్ మెంటులలో అన్నట్లు.

పట్నం కదా, దూరం నుంచి చుట్ట బంధువులు రావడానికి, ఇంకా టైమ్ పడుతుంది. నేనూ మా ఆవిడ శవానికి దండం పెట్టి, ఒక పక్కన నిల్చున్నాం.

ఈలోగా వాచ్‌మెన్ నా దగ్గరకొచ్చి చెవి దగ్గర మొహం పెట్టి, "సార్, వాళ్ళ అబ్బాయి ఏర్పాటు పనుల్లో బయటకి వెళ్ళాడు, మున్సిపాలిటీవాళ్ళు వచ్చారు, చనిపోయిన ఆయన పేరు అడుగుతున్నారు సార్" అన్నాడు.

నా గుండెలో రాయి పడినట్టు అయ్యింది. ఎవరితో ఎప్పుడు ఆయన గురించి మాట్లాడినా, 508 ఆయన అనే అనుకునే వాళ్ళంగానీ, ఎక్కడా ఆయన పేరు ప్రస్తావనకి వచ్చేది కాదు. అపార్ట్‌మెంట్‌లో ఆయన అనే కాదు, ఎవరి గురించి మాట్లాడాలన్నా, ఫలానా ఫ్లాట్ నంబరు ఆయన అనే అనుకుటాం గాని, పేరు పెట్టి మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువే.

ఇప్పుడు ఠక్కున అతని పేరు అడిగేసరికి ఉలిక్కపడ్డాను. నా పేరూ అపార్టైమెంటులోని అందరి దృష్టిలో కేరాఫ్ 407 అయ్యే ఉంటుంది కదా! అని లోలోపలే సిగ్గుపడ్డాను.

తలెత్తి చూస్తే శవం పక్కన శ్రద్ధాంజలి ఫొటో పెట్టి దీపం వెలిగించిన దగ్గర అతని పేరు కనిపించింది. హమ్మయ్య.. బతికిపోయానని ఊపిరి పీల్చుకున్నాను. కానీ లోలోపల "ఈ అపార్టైమెంట్ కల్చర్‌తో సాటి మనిషిగా ఎప్పుడో నేనూ చనిపోయాను.." అని అనుకున్నాను.

అక్కడనుంచి నెమ్మదిగా ముందుకు అడుగులు వేస్తూ, మరలా ఈ జీవితాలకి జీవం పోయాలి అనుకుంటూ, దహన సంస్కారాలు అయ్యేవరకూ చేతనైన సహాయ సహకారాలు అందిస్తూ ఈ రోజుకి నాకు నేనే ఓ ప్రేరణగా నిలిచాను.

– తిప్పాన హరిరెడ్డి

# ‘కొప్పు’ కోమలిది! ‘తప్పు’ సెలూన్‌ది!!

కొన్ని సన్నివేశాలు అందరినీ అలరిస్తాయి. కొన్ని ఉదంతాలు అందరినీ ఆకర్షిస్తాయి. కొన్ని కథలు అలవోకగా మనసుకు దగ్గరౌతాయి. కాకమ్మ కథలనూ ఎంతో ఆసక్తికరంగా వింటాం. వాటిలో కథాంశాలు ఎలాంటివయినా మన మెదడుకు మేతనే అందిస్తాయి. ఒక్కొక్కప్పుడు మానసికోల్లాసాన్నీ ఇస్తాయి. కొన్ని సందర్భాలు వింటుంటే “ఇలాగ కూడా జరుగుతాయా?” అని అనిపిస్తుంది. ఇప్పుడు చెప్పుకునేది కథేమీ కాదు... వాస్తవమే!



కొప్పున్న ఓ మహిళ తన హెయిర్ డ్రెసర్‌పై తనకు కావల్సిన మేకప్ చేయలేదని కస్సుబుస్సుమంది. కేశాలంకరణ అనగానే అది మహిళల వ్యక్తిత్వంలో ఒక భాగంగా గుర్తించాలి. అది వారి ఆత్మవిశ్వాసం, భావోద్వేగాలతో కలబోసి ఉంటుంది. రూపలాలిత్యం, కేశలాలిత్యాన్ని బట్టే మహిళల రూప లావణ్యం ఆస్వాదించడం లోకసహజం. అది చివరాఖరికి వినియోగదారుల కోర్టుకెక్కి బోలెడంత నష్టపరిహారం కూడా పొందగలిగింది. ఇలాంటి విషయాలు వినియోగదారుల పరిధిలోకి వస్తాయా? అంటే ఇంతకు ముందు ఎవరికీ తెలియకపోవచ్చు. కానీ ఇప్పుడు ఇలాంటి సందర్భంలో ‘కేశాలంకరణలో కేశాలు పొట్టివైపోతే వచ్చే ఆగ్రహం ఎంతవరకు తీసుకెళ్తుందో తాజా సంఘటనతో తేలిపోయింది. “సేవాలోపం ఎంత చిన్నదైనా పెద్ద మూల్యమే” చెల్లించాల్సి ఉంటుందని చెప్పిన వినియోగదారుల ఫోరం కేసు చర్చనీయాంశంగా మారింది. ‘వినియోగదారుల హక్కుల పరిరక్షణ’కు పట్టం కట్టే తీరిది. సాధారణంగా ‘హెయిర్ కట్’ అనేది చిన్న విషయంగా భావిస్తుంటాం. చంటిపిల్లలకొకలా, మధ్య వయస్కులకొకలా, వృద్ధ తరానికి మరోలా వారు కోరిన మేరకు ‘హెయిర్ కట్’ ల విషయంలో హెయిర్ డ్రెస్సెర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎక్కడో “అది బాలేదు.. ఇది బాలేదు” అనే నసుగుడు వినపడుతూనే ఉంటుంది. అలాంటప్పుడు నాలుగు రోజులాగితే “మళ్లీ” జుట్టు పెరుగుతుందిలే!” అని సమాధానపడి మరో పనిలోకి వెళ్లిపోతాం. ఏదో ‘తిరు’ క్షవరం చేసారనుకుని సరిపెట్టుకుంటాం.

కానీ ఢిల్లీకి చెందిన కార్పొరేట్ ఉద్యోగి ఒకరు తాను అడిగిన హెయిర్ స్టైల్ కాకుండా, మరోలా ఆమె భాషలో చెప్పాలంటే ‘అందవిహీనంగా’ తనకు ‘హెయిర్ కట్’ చేసి తనను మానసిక వ్యాకులతకు గురి చేసినందుకు ఆ హెయిర్ డ్రెస్సెర్‌పై ‘సేవాలోపం’ కింద కేసు వేసింది.

తన కేశాలను కింద భాగంలో నాలుగు అంగుళాలు మాత్రమే కత్తిరిస్తే చాలని చెప్పిన ఢిల్లీ మహిళ ఆశ్నారాయ్‌కి నిరాశే మిగిలింది.

అది సరిగా వినిపించుకోని హెయిర్ డ్రెస్సెర్ మాత్రం ఆమె పొడుగాటి జుట్టును చిత్ర విచిత్రంగా నరికేసి నాలుగు అంగుళాలకే పరిమితం చేసింది. సాధారణంగా హెయిర్ కట్‌కి వెళ్లినా, హెయిర్ డ్రెస్సింగ్‌కి వెళ్లినా పొట్టా, పొడుగా, మీడియంగానా అని అడుగుతుంటారు. ఇక్కడవేమీ పట్టించుకున్నట్లు లేదు.

2018లో జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి)లో తనకు న్యాయం కావాలని, తన కేశ సౌందర్యాన్ని పాడు చేసి తనపై తనకే జుగుప్స కలిగించే రీతిలో హెయిర్ డ్రెస్సెర్ సేవాలోపానికి కారణమైందని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసింది. విచారణ పూర్తయ్యాక ఎన్‌సిడిఆర్‌సి ఆశ్నా విషయంలో సేవాలోపం నిజమేనని నమ్మింది. రూ.2 కోట్లు నష్టపరిహారంగా చెల్లించాలని హెయిర్ సెలూన్‌ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో తనకు మంజూరు చేసిన పరిహారం తీసుకోగలిగింది.

కింది వినియోగదారుల కోర్టు రూ.2 కోట్లు పరిహారాన్ని సుప్రీం తన ముందుకొచ్చిన ఫిర్యాదును పరిగణించే క్రమంలో ఆ మొత్తాన్ని రూ.25 వేలకు నిర్ధారించింది. సేవలందించే ఏ సంస్థ అయినా వినియోగదారుల అవసరాలను గుర్తించాలి. సేవాలోపం సెలూన్ సిబ్బంది వలన జరిగినా యాజమాన్యమే బాధ్యత వహించాలి. ప్రస్తుత ఫిర్యాదులో ఆమె పేర్కొన్న విషయాలు పూర్తిగా నిజం జుట్టుకు సంబంధించి ‘తలకట్టు’ మారితే జనంలో తిరగడానికి కాస్త బిడియంగా ఉంటుంది. ఆమె వ్యక్తిగత జీవితంపైన కాకుండా, వృత్తి పరమైన అవకాశాలపై కూడా ప్రభావితం చూపినందున తనకు నష్టం వాటిల్లిందని ఆశ్నా ఆవేదన. ఆమె మోడలింగ్ రంగానికి చెందినది. హెయిర్ సెలూన్ వారి నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించాలన్నారు. ఇలాంటి అంశాల్లో వినియోగదారు అభిప్రాయానికి విలువివ్వకపోతే సేవాలోపం జరిగినట్లే! అదే అంశంపై నష్టపరిహారం లభించింది. వినియోగదారుల అవసరాన్ని గుర్తించకుండా ఎలాంటి సేవాలోపం జరిగినా దానికి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని దీని అర్థం.

– ఎస్.వి.జ్యోతి


# చికాగో వీధుల నుండి డిజిటల్ యుగం వరకు

మానవ నాగరికత పరిణామ క్రమంలో ప్రతి ఇటుక వెనుక ఒక శ్రమజీవి చెమట చుక్క ఉంది. ఆకాశహర్మ్యాలైనా, అద్భుత యంత్రాలైనా, ఆధునిక సాంకేతిక విప్లవాలైనా.. వాటన్నింటికీ ప్రాణాధారం కార్మికుడి కండరాల కష్టం. అలాంటి శ్రమకు గౌరవం, హక్కులకు హామీ, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన మహత్తర దినం మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం లేదా 'మే డే'.

ఇది కేవలం కేలండర్‌లోని ఒక సెలవు దినం మాత్రమే కాదు; శతాబ్దాలుగా సాగిన అణచివేతపై సాధించిన చారిత్రాత్మక విజయం. అశేష శ్రమజీవుల త్యాగాల పునాదులపై నిర్మితమైన ఆధునిక సమాజం, తనను తాను సమీక్షించుకుంటూ, శ్రామిక వర్గం పట్ల తన బాధ్యతను గుర్తు చేసుకునే సందర్భం ఇది.

పారిశ్రామిక విప్లవం అనంతర కాలం మానవాళికి అపారమైన సంపదను తెచ్చిపెట్టినప్పటికీ, దాని వెనుక ఉన్న కార్మికుల జీవితాలు అత్యంత దయనీయంగా ఉండేవి. 18వ, 19వ శతాబ్దాల్లో యజమానుల దోపిడీకి హద్దుల్లేవు. సూర్యోదయం కంటే ముందే కర్మాగారాల్లోకి ప్రవేశించిన కార్మికుడు, అర్ధరాత్రి దాటే వరకు యంత్రాల మధ్య నలిగిపోవాల్సి వచ్చేది. రోజుకు 14 నుంచి 16 గంటల పాటు కఠిన శ్రమ చేసినా, కనీస అవసరాలు తీరని అల్ప వేతనాలు, అపరిశుభ్రమైన పని ప్రదేశాలు వారిని రోగాలపాలు చేసేవి. పని ప్రదేశాల్లో భద్రత అనేది మచ్చుకైనా కనిపించేది కాదు. చిన్నారి చేతులు యంత్రాల మధ్య చిక్కుకుపోవడం, మహిళా కార్మికులపై వివక్ష ఆనాటి నిత్యకృత్యాలు. ఈ అమానవీయ పరిస్థితులే కార్మిక వర్గాన్ని ఏకం చేశాయి. 'ఎనిమిది గంటల పని ఎనిమిది గంటల విశ్రాంతి ఎనిమిది గంటల వ్యక్తిగత జీవితం' అనే నినాదం ఒక రణగర్జనలా ప్రపంచమంతటా మారుమోగింది.

ఈ పోరాటంలో అమెరికాలోని చికాగో నగరం ప్రపంచ కార్మికోద్యమానికి దిశానిర్దేశం చేసిన కేంద్రబిందువైంది. 1886 మే 1న సుమారు మూడు లక్షల మంది కార్మికులు గొంతు కలిపి, పని గంటల తగ్గింపు కోసం సమ్మెకు పిలుపు నిచ్చారు. ఈ ఉద్యమం అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఒక ప్రభంజనంలా వ్యాపించింది.




అయితే, మే 4న చికాగోలోని హేమార్కెట్ స్క్వేర్‌లో జరిగిన సంఘటన మానవ చరిత్రలో ఒక కన్నీటి ఘట్టం. శాంతియుతంగా సాగుతున్న కార్మికుల సభపైకి అకస్మాత్తుగా బాంబు విసరడం, ఆ సాకుతో పోలీసులు జరిపిన విచక్షణారహిత కాల్పులు అపార ప్రాణ నష్టానికి దారితీశాయి.

కార్మిక నాయకులను కుట్ర పూరితంగా బంధించి, ఉరిశిక్షలు విధించినప్పటికీ, వారు చిందించిన రక్తం వ్యర్థం కాలేదు. వారి బలిదానం అంతర్జాతీయ కార్మిక ఐక్యతకు పటిష్టమైన పునాది వేసింది. 1889లో పారిస్‌లో జరిగిన 'సెకండ్ ఇంటర్నేషనల్' సమావేశంలో, హేమార్కెట్ అమరవీరుల స్మృత్యర్థం ప్రతి ఏటా మే 1ని 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం'గా జరపాలని నిర్ణయించారు. భారతదేశ కార్మికోద్యమ చరిత్ర కూడా వీరోచిత పోరాటాలతో ముడిపడి ఉంది. మన దేశంలో తొలిసారిగా 1923 మే 1న చెన్నై (మద్రాస్) సముద్ర తీరాన మలయపురం సింగారవేలు చెట్టియార్ నేతృత్వంలో మే డే నిర్వహించారు. లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందూస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోనే భారతదేశంలో తొలిసారిగా 'ఎర్రజెండా'ను కార్మిక పోరాట చిహ్నంగా ఎగురవేశారు.

ఇది భారత శ్రామిక వర్గంలో కొత్త ఉత్తేజాన్ని నింపింది. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత జరిగిన అనేక ఉద్యమాల ఫలితంగానే నేడు మనం చూస్తున్న 1948 ఫ్యాక్టరీల చట్టం, కనీస వేతనాల చట్టం, బోనస్ చట్టం వంటివి రూపుదిద్దుకున్నాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వైస్రాయ్ కౌన్సిల్‌లో కార్మిక సభ్యునిగా ఉన్న సమయంలోనే పని గంటలను 12 నుంచి 8 గంటలకు తగ్గించడం, ప్రసూతి సెలవులు, బీమా సౌకర్యం వంటి విప్లవాత్మక

సంస్కరణలకు బీజం పడింది. ప్రస్తుత గణాంకాలను పరిశీలిస్తే, భారతదేశంలో సుమారు 50 కోట్లకు పైగా కార్మిక శక్తి ఉంది. అయితే, ఇందులో విషాదకరమైన అంశం ఏమిటంటే- సుమారు 90 శాతం మంది అనధికారిక (Unorganized) రంగంలోనే ఉన్నారు. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, గృహ కార్మికులు వంటి వీరికి సామాజిక భద్రత కరువైంది. వీరికి స్థిరమైన వేతనం, పెన్షన్, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు అందని ద్రాక్షగానే మిగిలాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదికల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి కల్పనలో పెరుగుదల ఉన్నప్పటికీ, జీవన ప్రమాణాలు మెరుగు పడటం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా మహిళా కార్మికులకు పురుషులతో సమానంగా వేతనం లభించకపోవడం అనేది నేటికీ పరిష్కారం కాని అతిపెద్ద సామాజిక సమస్య. ఇక ఆధునిక కాలంలో 'గ్లోబలైజేషన్', 'డిజిటలైజేషన్' కార్మిక రంగానికి సరికొత్త సవాళ్లను విసిరాయి. నేడు 'గిగ్ ఎకానమీ' (Gig Economy) రూపంలో కొత్త తరహా దోపిడీ చోటుచేసుకుంటోంది. ఉబర్, స్విగ్గీ, జొమాటో వంటి వేదికలపై ఆధారపడి పనిచేసే లక్షలాది మంది యువతను 'కార్మికులు'గా కాకుండా 'భాగస్వాములు' (Partners)గా పిలుస్తూ, వారికి అందాల్సిన చట్టబద్ధమైన హక్కులను, భద్రతను సంస్థలు విస్మరిస్తున్నాయి. నిరంతర పర్యవేక్షణ, టార్గెట్ల ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల వీరి మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటోంది. మరోవైపు, కృత్రిమ మేధ (AI), ఆటోమేషన్ వల్ల భవిష్యత్తులో నైపుణ్యం లేని కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. సాంకేతికత పెరిగినప్పుడు అది కార్మికుడి పని భారాన్ని తగ్గించాలి కానీ, కార్మికుడి పొట్ట కొట్టకూడదనే వాదన బలంగా వినిపిస్తోంది.




భారత ప్రభుత్వం ఇటీవల 44 కార్మిక చట్టాలను కలిపి నాలుగు లేబర్ కోడ్‌లుగా (Labour Codes) మార్చింది. ఇది పెట్టుబడుల ఆకర్షణకు, సరళీకరణకు దోహద పడుతుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, కార్మిక సంఘాలు మాత్రం ఇది యజమానులకు కొమ్ముకాసే చర్యగా, కార్మికుల సమ్మె చేసే హక్కును హరించే ప్రయత్నంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ప్రత్యేకించి కాంట్రాక్ట్ విధానం పెరగడం వల్ల 'సమాన పనికి సమాన వేతనం' అనే సూత్రం తుంగలో తొక్కబడుతోంది. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టాలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మహిళా కార్మికుల భద్రత నిత్యం ప్రశ్నార్థక మవుతోంది. అసంఘటిత రంగంలో పనిచేసే వలస కార్మికుల స్థితిగతులు కోవిడ్ కాలంలో ఎంత దారుణంగా ఉంటాయో ప్రపంచం చూసింది. వారి డేటాబేస్ సేకరణ వంటి చర్యలు మొదలైనప్పటికీ, అది ఇంకా పూర్తి స్థాయి ప్రయోజనాలను చేకూర్చాల్సి ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంపదలో మెజారిటీ వాటా కేవలం ఒక శాతం ఉన్న ధనవంతుల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటం, శ్రమ దోపిడీకి పరాకాష్ట. ఆక్స్‌ఫామ్ (Oxfam) వంటి సంస్థల నివేదికలు ఈ ఆర్థిక అసమానతలను స్పష్టం చేస్తున్నాయి. సంపద సృష్టించేది కార్మికుడైతే, ఆ సంపద ఫలాలు అనుభవించేది మాత్రం పెట్టుబడిదారులే కావడం సామాజిక అశాంతికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలోనే మే డే ప్రాముఖ్యత నేటికీ సజీవంగా ఉంది. మే డే అంటే ఎర్రజెండాల ప్రదర్శన మాత్రమే కాదు, ఇది కార్మిక వర్గం తన రాజకీయ, ఆర్థిక హక్కుల పట్ల జాగృతమయ్యే రోజు. ఐక్యమత్యమే మహాబలమని చాటిచెబుతూ, యాజమాన్యాల నిరంకుశత్వాన్ని ప్రశ్నించే ధైర్యం.

రైతుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల నుంచి గనుల్లో పనిచేసే కూలీల వరకు అందరూ శ్రమజీవులే. వీరందరికీ కనీస వేతనం, పని ప్రదేశంలో గౌరవం, సామాజిక భద్రత కల్పించినప్పుడే ఒక దేశం నిజమైన అభివృద్ధి సాధించినట్లు లెక్క. ఆధునిక కాలంలో కార్మిక సంఘాలు బలహీనపడుతున్నాయని భావించడం పొరపాటు; అవి సరికొత్త రూపాల్లో సంఘటితం కావాల్సిన అవసరం ఉంది. కేవలం పారిశ్రామిక కార్మికులే కాకుండా, సేవా రంగంలోని బాధితులు కూడా తమ హక్కుల కోసం గళం ఎత్తాలి. 1886 నాటి చికాగో వీధుల నుంచి నేటి డిజిటల్ యుగం వరకు శ్రమజీవుల పోరాటం నిరంతరం సాగుతూనే ఉంది.

నాటి హేమార్కెట్ అమరవీరుల త్యాగం వృథా పోకూడదంటే, నేటి కార్మిక లోకం ఎదుర్కొంటున్న కొత్త తరహా బానిసత్వాన్ని పారదోలాలి. ప్రభుత్వం, యాజమాన్యాలు, సమాజం కార్మికుడిని కేవలం ఒక ఉత్పత్తి సాధనంగా కాకుండా, భావోద్వేగాలు, ఆశయాలు ఉన్న ఒక మనిషిగా గుర్తించాలి. శ్రమకు తగిన ఫలితం, మనిషికి తగిన మర్యాద లభించినప్పుడే మే డే ఆశయాలు నెరవేరుతాయి. శ్రమశక్తికి వందనం చేస్తూ, కార్మిక ఐక్యతను చాటే ఈ దినోత్సవం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలి. శ్రమ జీవనం సుఖమయం కావాలి, సమసమాజ స్థాపన దిశగా అడుగులు పడాలి. అది కార్మికుల హక్కు మాత్రమే కాదు, నాగరిక సమాజం ప్రాథమిక బాధ్యత కూడా.

– రామకిష్టయ్య సంగనభట్ల

కథ

# పెట్టెలో ఏముంది?

పదవ తరగతి చదువుతున్న రవితేజకు లెక్కల్లో తక్కువ మార్కులు వచ్చేవి. అందుకని వాడి తాత లెక్కల మాస్టారు దగ్గర ట్యూషన్ పెట్టించాడు. మొదటిరోజు సాయంత్రం ట్యూషన్‌కి వెళ్ళాడు రవితేజ.

ఆ ట్యూషన్‌కి వేరే బడి పిల్లలు కూడా వచ్చేవాళ్లు. ట్యూషన్‌కి ముందూ, ట్యూషన్ తర్వాత కొత్త స్నేహితులతో కబుర్లు చెప్తుండేవాడు రవితేజ. చిన్న చిన్న ఆటలు కూడా ఆడుకునేవాడు. మొదటిరోజు ట్యూషన్ పూర్తయ్యేసరికి రాత్రి తొమ్మిది గంటలయ్యింది. బ్యాగు భుజానికి తగిలించుకుని ఇంటికి వచ్చాడు.



అప్పటికే తాత ఉన్న నాలుగు చపాతీలు తినేసి మంచం మీద కొద్దిసేపు కూర్చున్నాడు. ఆ తరువాత మెలకువగానే మంచం మీద పడుకున్నాడు. నిద్ర ముంచుకు రావడంతో దుప్పటి కప్పుకుని పడుకోబోతున్న రవితేజతో దగ్గుతున్న తాత "తెచ్చింది పెట్టెలో దాచి పెట్టి పడుకో!" అన్నాడు. రవితేజకు ఏమీ అర్థం కాలేదు. "నిద్రమత్తులో ఉన్నాడేమో తాత" అని ఊరుకున్నాడు. రెండో రోజు కూడా పడుకోబోయే ముందు తాత "తెచ్చింది పెట్టెలో పెట్టి పడుకో!" అన్నాడు.

"నేనేమీ తీసుకురాలేదు కదా, పెట్టడానికి మన ఇంట్లో అసలు పెట్టే లేదు కదా, తాతకు చాదస్తం ఎక్కువయ్యింది" అని నవ్వుకుంటూ పడుకున్నాడు. మూడో రోజు సాయంత్రం నుంచి వర్షం మొదలయ్యింది. ట్యూషన్ అయ్యాక వానలో తడుసుకుంటూ ఇంటికి చేరాడు. ఆ రోజు కూడా తాత అదే మాట అన్నాడు. తాత మాటలకు రవితేజకు కొంచెం నవ్వు, కొంచెం కోపం తెప్పించాయి. "ఏమి తెచ్చినానని పెట్టెలో పెట్టమంటావు? అసలు పెట్టె ఎక్కడ ఉంది మన ఇంటిలో?" అని గట్టిగా అన్నాడు.

తాత నవ్వుతూ "నాయనా... రోజూ బాగా అలంకరించుకుని టింగు రంగడి లెక్కన ట్యూషన్‌కి వెళ్ళి వస్తున్నావు. సంతోషం. అయితే నువ్వు అక్కడికి వెళ్ళేది లెక్కలు బాగా నేర్చుకోవడానికి. మాస్టర్ చెప్పింది ఒక చెవితో విని మరో చెవితో వదిలేయకూడదు. దాన్ని 'మది' అనే పెట్టెలో భద్రంగా దాచి పెట్టాలి. ఇంటికొచ్చాక ఒకసారి దాన్ని మననం చేసుకోవాలి. నీకు ఇంకో మంచి విషయం చెబుతాను. అదేమిటంటే 'సింహావలోకనం' చేసుకోవాలి. సింహం అడవిలో నడుస్తూ మధ్యలో ఒకసారి ఎంత దూరం వచ్చామని వెనక్కి తిరిగి చూసుకుంటుందట. అలాంటి సింహావలోకనం నువ్వు చేయాలి. రాత్రి పడుకోబోయే ముందు, ఆ రోజు ఏయే లెక్కలు నేర్చుకున్నామో ఒకసారి గుర్తు చేసుకుని పడుకుంటే లెక్కల్లో మార్కులు తెచ్చుకోవడం సులభం" అని తాత వివరించాడు. తాత తెలివితేటలకు ఆశ్చర్యపోయాడు రవితేజ. "నిజమే! ట్యూషన్‌కి వెళ్ళడం వేరు. అక్కడ నేర్చుకున్నదాన్ని మదిలోకి తీసుకోవడం వేరు. మదిలోకి తీసుకుంటేనే మనకి చాలా కాలం గుర్తుండిపోతుంది" అని గుర్తించాడు. ఆ రోజు నుంచి మరింత శ్రద్ధగా ట్యూషన్‌కి వెళ్తూ లెక్కలన్నీ బాగా నేర్చుకున్నాడు. పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు.

– ఆర్.సి.కృష్ణస్వామిరాజు





## బాలగేయం




### రూపాయమ్మా!

రూపాయమ్మా..
రూపాయి!
ఎంతో చక్కని రూపాయి
లోకాన్ని నడిపే రూపాయి
పండే పంట రూపాయి
ఎండిన ధాన్యం రూపాయి.

కార్మికుని శ్రమ రూపాయి
కర్షకుని చెమట రూపాయి
కష్టంతోనే వస్తుంది
ఖాళీగుంటే రానంది
అది ఉంటేనే విలువుంది
లేకుంటే గరీబ్ అంది.

రూపాయమ్మా రూపాయి
ఎంతో చక్కని రూపాయి
లోకాన్ని నడిపే రూపాయి.

– ఏడుకొండలు కళ్ళేపల్లి

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**సి.శశికళ, గద్వాల**

**ప్రశ్న: కిడ్నీలలో రాళ్లు ఏర్పడటానికి కారణాలు?**

**జవాబు:** మూత్రంలో యూరిక్ యాసిడ్ అధిక స్థాయిలో ఉత్పత్తి కావడం; విటమిన్ సి, డి వున్న మందులను విచక్షణారహితంగా వాడటం; ప్రతిరోజు తగినన్ని నీళ్లు తాగకపోవడం; ప్రతిరోజూ అవసరమైనంత శారీరక శ్రమ చేయకపోవడం.. మొదలైన కారణాల వల్ల మూత్రపిండాలలో (కిడ్నీలు) రాళ్లు ఏర్పడతాయి. కొన్ని సందర్భాలలో మూత్రనాళం ఇన్‌ఫెక్షన్‌కు గురయినా, ఆహారంలో కాల్షియం, ఫాస్పరస్ లవణాలు అధికంగా వున్నా, జన్యుపరమైన కారణాలు ఉన్నా కూడా కిడ్నీలలో రాళ్లు ఇసుకరేణువంత సైజు నుంచి 12 మి.మీ. లేదా అంతకన్నా ఎక్కువ సైజులో కూడా ఏర్పడవచ్చు. 5 మి.మీ. కంటే పెద్దవి ఉన్నట్లయితే ఆపరేషన్ చేయాల్సి వస్తుంది.

**బి.ఆశ్లేష, నూజివీడు**

**ప్రశ్న: క్యారెట్ తింటే కంటి చూపుకు మంచిదా?**

**జవాబు:** క్యారట్‌లో విటమిన్ 'ఏ' సమృద్ధిగా ఉంటుంది. కంటి ఆరోగ్యానికి ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయల్లో ఇది ఒకటి. విటమిన్ సి,ఇ మొదలైన యాంటి ఆక్సిడెంట్ విటమిన్‌లు సమృద్ధిగా ఉండే తాజా కూరగాయలు, ఆకుకూరలు క్యారెట్‌ల కంటే ఎంతో ఎక్కువ మేలు చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్ విటమిన్‌లు శుక్లాల నుంచి, వయసు పెరుగుతున్నకొద్దీ పెరిగే మ్యాకులర్ డీ జనరేషన్ తరహా కంటి చూపు, సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి. అయితే, క్యారెట్‌లు, ఇతర కూరగాయలు, విటమిన్ సప్లిమెంట్‌లు తీసుకోవడం వలన ప్రాథమిక దృష్టి పరంగా వచ్చే సమస్యలు(దీర్ఘ దృష్టి, హ్రస్వ దృష్టి) మాత్రం పూర్తి పరిష్కారం కావు.





# కవిత్వానికి మూలనాదాలు..

**కవిత్వం అనేది మానవ హృదయంలోని అగాథ భావోద్వేగాలకు ప్రతిరూపం. మనిషి ఆవిర్భవించిననాటి నుండి అతడు పర్యావరణంతో విడదీయరాని సంబంధం కలిగివున్నాడు.**

గాలి, నింగి, నీరు, నేల.. ఇవి కవి జీవనానికి మూలాధారాలు మాత్రమే కాకుండా, అతని భావుకతకు కూడా ఆధారాలు. పూర్వపు వేదసూక్తాల నుండి ఆధునిక కవిత్వం వరకు ప్రతి తరంలోనూ ఈ నాలుగు మూలాలను కవులు ఎప్పటికప్పుడు పునరావృతం చేస్తూనే ఉన్నారు.

ఒకవైపు జీవనాధారం, మరోవైపు భావాలాధారం. జీవం నిలబడేందుకు గాలి కావాలి, ఆశను నిలుపుకోవడానికి నింగి కావాలి, జీవన ప్రవాహానికి నీరు కావాలి, స్థిరత్వానికి నేల కావాలి. అందువల్లే కవి కలానికి మొదటి స్ఫూర్తిగా ఈ సహజ మూలాలు వస్తాయి.

## కవులు ఎందుకు గాలిని ఎంచుకున్నారు?

గాలి అనేది కనిపించదు కానీ అనుభూతి అవుతుంది. కవులకు ఈ లక్షణం అత్యంత ఆకర్షణీయమైనది. మానవ భావాలు, ప్రేమ, విరహం, కలలు, దుఃఖం.. ఇవన్నీ కూడా గాలిలా కంటికి కనిపించవు కానీ మనసులో ముద్ర వేస్తాయి. అందువల్లే గాలి కవిత్వంలో ఒక శాశ్వత ప్రతీకగా మారింది. గాలి ఊపిరి లాంటిది. ఊపిరి అంటే జీవితం. కవికి జీవితం అంటే కవిత్వమే. గాలి చల్లదనాన్ని ఇస్తుంది, వేడిని చల్లారుస్తుంది.

అలా కవి మనసులోని ఆవేశాలను శాంతపరిచే శక్తి కూడా గాలిలోనే ప్రతిబింబిస్తుంది. గాలి మార్పును సూచిస్తుంది. ఒక కాలం నుంచి మరో కాలానికి మార్పు, ఒక భావన నుంచి మరో భావనకు మార్పు. కవిత్వం కూడా ఆ మార్పు ప్రయాణమే.

## నింగి–అగాథ కలల ప్రతీక

నింగి అనేది ఆకాశం. అది ఎంత విశాలమో, అంతే విశాలంగా కవి మనసు ఉంటుంది. కవిత్వానికి సరిహద్దులు లేవు, కలలకు పరిమితులు లేవు. కాబట్టి కవులు తరచుగా నింగిని ప్రతీకగా తీసుకుంటారు. నింగి అనేది కలల గమ్యం. కవి చూపు ఎప్పుడూ పైకి లేస్తుంది. నింగి విశాలతను ప్రతిబింబిస్తుంది. కవి తన భావాలను ఆ విశాలతలో విస్తరిస్తాడు. నింగి నక్షత్రాలతో, చంద్రునితో, మేఘాలతో అనేక రూపాలను చూపిస్తుంది. కవి మనసులోని మార్పులు కూడా అంతే విభిన్నంగా ఉంటాయి. నింగి కవిత్వానికి ఒక దిక్సూచి. అది కవికి ఆశ, అన్వేషణ, విశ్వాసానికి మూలం.

## నీరు–జీవన ప్రవాహ ప్రతిరూపం

నీరు లేకుండా జీవం ఉండదు. కవిత్వం లేకుండా కవి ఉండడు. అందువల్ల నీరు కవిత్వంలో నిరంతరంగా ఉరకలేస్తూనే ఉంటుంది. నీరు ప్రవహిస్తుంది. కవిత్వం కూడా ప్రవాహమే. అది ఆగదు, నిరంతరం ముందుకు సాగుతుంది. నీటికి అనేక రూపాలు ఉంటాయి.. జలపాతం, వర్షం, నది, సముద్రం. కవి భావాలకు కూడా అంతే రూపాలు ఉంటాయి. నీరు శుద్ధి చేస్తుంది. కవిత్వం మనసును శుద్ధి చేస్తుంది. నీరు కవులకు సౌందర్యాన్ని, సమాధానాన్ని, కొన్నిసార్లు విధ్వంసాన్ని కూడా చూపిస్తుంది. అందువల్ల అది కవిత్వానికి బలమైన ఆధారం.

## నేల–స్థిరత్వం, ఆవిష్కరణల మూలం

నేల అనేది మూలం. అందులోంచే మొక్కలు పుడతాయి, వాటిలోంచే జీవం నిలుస్తుంది. కవిత్వానికి కూడా నేలలాంటి పునాది అవసరం. నేల కవికి మూలాలను గుర్తు చేస్తుంది. జాతి, భాష, సంస్కృతి- ఇవన్నీ నేలలోనే నిక్షిప్తమై ఉంటాయి. నేల



కష్టానికి ప్రతీక. రైతు రక్తాన్ని జారుస్తూ పంట పెంచినట్టు, కవి తన హృదయాన్ని జారుస్తూ కవిత్వం సృష్టిస్తాడు. నేల లేకుండా మనిషికి నిలువుదిక్కు ఉండదు. అలాగే కవిత్వం కూడా పునాదిలేని మాటల సమాహారమవుతుంది. కాబట్టి నేల అనేది కవిత్వంలో స్థిరత్వానికి, మూలాలకు, భవిష్యత్తుకు ప్రతీక. ఈ ప్రతీకలు సహజసిద్ధమా లేక సాహిత్యసిద్ధమా? కవులు సహజంగా గాలి, నింగి, నీరు, నేలను ఎంచుకున్నారా? లేక సాహిత్య సంప్రదాయం వల్ల వాటిని అనుసరించారా? అన్న ప్రశ్న చాలా మందికి వస్తుంది.

**సహజసిద్ధమైన కోణం:** మనిషి జీవితం ఈ నాలుగింటిపై ఆధారపడి

ఉంది. కవి కూడా మానవుడే కాబట్టి అతని భావాలు సహజంగానే వీటిని చుట్టుకుని ఉంటాయి. ప్రాచీన కాలం నుండి మహాకవులు ఈ ప్రతీకలను ఉపయోగించారు.

ఆ పద్ధతి తరతరాల కవులపై ప్రభావం చూపింది. కనుక నేటి కవులు కూడా వాటిని కొనసాగిస్తున్నారు. నిజానికి రెండు కోణాలు కలిసే కవిత్వాన్ని సృష్టిస్తాయి. సహజ అనుభవం మూలం, సాహిత్య సంప్రదాయం దానికి బలం.

## భావనల ఇనుమడింపు

కవి రాసేవాడు మాత్రమే కాదు.. అనుభూతి చెందేవాడు. కథకుడు కేవలం చెప్పేవాడు కాదు; ఊహింపజేసేవాడు. రచయిత కేవలం అక్షరాలు కూర్చేవాడు కాదు; జీవనాన్ని రాసేవాడు. ఈ మూడు పాత్రల్లో ఒక సామాన్యం ఉంది.. ప్రపంచాన్ని లోతుగా అనుభూతి చెందడం. గాలి కవికి ఊపిరి ఇస్తుంది, నింగి కలలు ఇస్తుంది, నీరు ప్రవాహం ఇస్తుంది, నేల స్థిరత్వం ఇస్తుంది. ఈ నాలుగూ కలిపి కవికి ఒక 'పూర్ణత'ని ఇస్తాయి. కవిత్వం ఆ పూర్ణతకు ప్రతిబింబం.



## సంక్లిష్టతలో సౌందర్యం

కవిత్వం సహజ దృశ్యాలను వర్ణించడం కాదు. వాటిలో మానవ అనుభూతులను, సామాజిక వాస్తవాలను, ఆత్మీయ భావాలను నిక్షిప్తం చేయడం. ఉదాహరణకు: గాలిని స్వేచ్ఛగా చూపవచ్చు, ఆవేశంగా చూపవచ్చు; నింగిని ఆశగా చూపవచ్చు, ఖాళీగా చూప వచ్చు. నీటిని జీవంగా చూపవచ్చు, కష్టాల వరదగా చూపవచ్చు. నేలను తల్లిగా చూపవచ్చు, రక్తపుటేరుగా చూపవచ్చు. ఈ సంక్లిష్టత కవిత్వానికి అజరామరత్వాన్ని ఇస్తుంది.

## ఆధునిక కవిత్వంలో..

పూర్వం కవులు ప్రకృతిని ఎక్కువగా వర్ణించేవారు. ఆధునిక కవులు మాత్రం సామాజిక సమస్యలు, మానవ హక్కులు, పర్యావరణ సంక్షోభం.. వంటి అంశాలను ఎక్కువగా రాస్తున్నారు. అయినా గాలి, నింగి, నీరు, నేల లాంటి మూలాలు వారిని విడిచిపెట్టలేదు. ఎందుకంటే ఇవి లేకుండా ఏ సమస్యనూ అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. పర్యావరణ కాలుష్యం గురించి రాస్తే గాలి, వాతావరణ మార్పుల గురించి రాస్తే నింగి, నీటి కొరత గురించి రాస్తే నీరు, భూ సంక్షోభం గురించి రాస్తే నేల తప్పనిసరిగా వస్తాయి. కాబట్టి ఇవి నేటికీ కవిత్వానికి కేంద్రబిందువే. గాలి, నింగి, నీరు, నేల.. ఇవి కేవలం సహజ పదార్థాలు కావు. ఇవి మానవ అనుభూతుల రూపాలు. కవులు వీటిని ఎంచుకోవడం సహజసిద్ధమూ, సాహిత్యసిద్ధమూ రెండూ కలిసిన ప్రక్రియ. కవిత్వం అనే భావనకు ఇవి శాశ్వత నాదాలు. కవి ఊపిరి పీల్చినప్పుడల్లా గాలిని అనుభూతి చెందుతాడు. కవి చూపు లేస్తే నింగిని చూస్తాడు. కవి కన్నీరు కారితే అది నీటిగా మారుతుంది. కవి నడుస్తే నేలపై అడుగుపెడతాడు. ఈ నాలుగూ కవి హృదయానికి, కవిత్వానికి విడదీయరాని ఆధారాలు. అందువల్లే సాహిత్యంలో అవి ఎప్పటికీ వెలుగుతూనే ఉంటాయి.

– డా. చిటికెన కిరణ్‌కుమార్

# సౌందర్య సాధనంగా ఆముదం..

ఆముదం సహజసిద్ధమైన సౌందర్య సాధనంగా ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు. ఇది మన బామ్మలు, అమ్మమ్మలు.. ఇలా అందరూ చెప్పిన విషయం తెలిసిందే! మన వంటిల్లే ఓ చిన్నపాటి వైద్యశాల అని చెప్పవచ్చు.

– ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకునే ముందు ఒక చుక్క ఆముదాన్ని పెదవులకు రాసుకుంటే కొద్ది రోజుల్లోనే అధరాలు అందంగా మారతాయట. ఇలా ఆముదం సహజసిద్ధమైన లిప్ బామ్‌గా పనిచేస్తుందంటున్నారు నిపుణులు.



– కొంతమందికి గోళ్ళు కాస్త పెరగగానే విరిగిపోతుంటాయి. ఈ సమస్య ఉన్నవారు రోజూ పడుకునే ముందు ఆముదంతో గోళ్లను పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఇలా కొద్ది రోజుల పాటు చేయడం వల్ల గోళ్లు దృఢంగా మారుతాయి. అంతేకాదు.. రోజూ ఆముదం రాసుకోవడం వల్ల గరుకుగా ఉన్న చర్మం కూడా మృదువుగా మారుతుందట.

– రోజూ ఆముదం రాసుకోవడం వల్ల చర్మానికి తగినంత తేమ అందుతుంది. ఫలితంగా చర్మం తాజాగా కనిపిస్తుంది. చర్మం ముడతలు పడకుండా చేసే గుణాలూ ఆముదంలో బోలెడున్నాయి. అందుకే దీన్ని యాంటీ ఏజింగ్ చికిత్సల్లో కూడా ఉపయోగిస్తారంటున్నారు నిపుణులు. ఆముదం అందాన్ని ద్విగుణీకృతం చేసేదే అయినా దానిని వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం తప్పనిసరి! ■

కథ

# సారీ.. కాదు అంతకుమించి

ఇలపావులూరి శేషతల్పశాయి

**"ఈ రోజు** మన పెళ్లిరోజు కదా. సినిమాకు వెళదామండి" అని అడిగినందుకు తప్పకుండా వస్తానని చెప్పి ఇప్పుడా వచ్చేది. సాయంత్రం అయిదింటికి వస్తానన్నారు. ఇప్పుడు ఎనిమిదయ్యింది. అసలు నేను గుర్తున్నానా? నా కోరిక తీర్చవలసిన బాధ్యత నీకు లేదా? మీరు నా గురించి ఏమాత్రం ఆలోచించరా?" అరిచినట్లుగా మాట్లాడుతోంది రాధ.

"ఇప్పుడేమైందని అంతగా అరుస్తున్నావు. ఆఫీసులో పని ఎక్కువగా వున్న రోజు ఆలస్యం కావటం నాకు సహజమే. నువ్వు ఎంత గొంతు చించుకున్నా నాకు వీలు కానప్పుడు నేను రాలేను. నువ్వు అర్థం చేసుకో" సూటిగా సమాధానం చెప్పాడు ఆనంద్.

"నీకు, నీ ఉద్యోగం నీ స్నేహితులు తర్వాతే నేను. నాతో నీకు అవసరం లేదు. నా మాట అంటే నీకు లెక్క లేదు. నీకు మగాడివనే అహంకారం ఎక్కువ. ఎక్కడికి పోతాయి ఆ బుద్ధులు అంతా ఆ తానులో గుడ్డలే కదా. మీ అమ్మ నాన్నలు కూడా ఎవరినీ లెక్క చెయ్యరు అదే అలవాటు నీకు వచ్చింది" గబగబా తిట్టసాగింది.

"నేను నిన్ను ఏమీ అనలేదు కదా! ఎందుకు అలా మాట్లాడతావు. కొంచెం ఆలోచించి మాట్లాడు" అన్నాడు ఆనంద్. "మీరు ఏమీ అనరు. అంతా నా చేత అనిపిస్తారు. అదే మీరు మీ అమ్మ దగ్గర నేర్చుకుంది. మీరు ప్రశాంతంగా వుంటారు. ఎదుటివారిని పిచ్చివారిని చేసి తప్పు వారిపై నెట్టేస్తారు.

మీ అంత తెలివితేటలు నాకు లేవు. ఇకపై నేను నాకు విలువలేని చోట ఉండటం కూడా నాకు ఇష్టం లేదు" అంటూ బట్టలు సర్దుకుని వెళ్లిపోయింది రాధ.

....................


"రామ్మా! లోపలికి రా!! ఏంటి ఇలా హఠాత్తుగా వచ్చావు?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతమ్మ అప్పుడే లోపలికి వస్తున్న రాధను చూసి.

"ఏమ్మా, రాకూడదా? అనుకోకుండా వచ్చానమ్మా. ఆనంద్‌కు నాకూ గొడవైంది. అందుకే వచ్చా. నేను కొన్ని రోజులు ఇక్కడే వుంటా. నాన్నకు నువ్వే ఏదో ఒకటి చెప్పి నన్ను ఏమీ అనకుండా చెయ్యి సరేనా అంది" బాధగా.

"సరే! నీ ఇష్టం తల్లీ. వెళ్లి రెస్ట్ తీసుకో తరువాత మాట్లాడదాం' చెప్పింది పార్వతమ్మ,

....................

"హలో ఆనంద్, బాగున్నావా?" ఫోనులో అడిగాడు రవికిరణ్.




"హలో రవికిరణ్ చెప్పు, ఏంటి సంగతులు" అడిగాడు ఆనంద్.

"ఏం లేదు ఆనంద్! నేను ఈరోజు హైదరాబాదు నుండి అద్దంకి వచ్చాను. ఇంటి అడ్రసు చెప్పు. సాయంత్రం ఒంగోలు వస్తే మీ ఇంటికి వస్తాను నిన్ను చూసి చాలా రోజులైంది" అన్నాడు రవికిరణ్.

"మంచి టైంకి వస్తున్నావు తప్పకుండా రా. మనం కాసేపు మాట్లాడుకుందాం" అని తన చిరునామా చెప్పాడు ఆనంద్.

ఆనంద్ రవికిరణ్ ఆప్తమిత్రులు. ఆనంద్ పెళ్లికి కూడా వచ్చాడు రవికిరణ్. తరువాత కూడా అప్పుడప్పుడు ఒంగోలు వచ్చినప్పుడు కలుస్తూ వుండేవారు. తల్లిదండ్రులు అద్దంకిలో వుంటారు. రవికిరణ్ హైదరాబాదుకు ఉద్యోగం కోసం వెళ్లాడు. చాలా రోజుల తర్వాత ఇప్పుడు అనుకోకుండా వస్తున్నాడు.

చెప్పినట్లుగానే సాయంత్రం నాలుగు గం టలకల్లా ఒంగోలు వచ్చాడు రవికిరణ్.

రాగానే ఒంటరిగా వున్న ఆనంద్‌ను చూసి, "ఇంట్లో ఒక్కడివే ఉన్నావు, నీ భార్య ఏదైనా ఊరెళ్లిందా?" అడిగాడు, రవికిరణ్.

"అవును రవికిరణ్. నా భార్య రాధ నిన్ననే వాళ్లమ్మ వాళ్లింటికి వెళ్లింది, ఏదో చిన్న గొడవ జరిగింది. చెప్పకుండా వెళ్లింది. ఆవేశంతో అనకూడని మాటలు అనటమే కాకుండా అలిగి చెప్పకుండా వెళ్లింది. తప్పు తనే చేసింది. అందుకే నేను కూడా పట్టించుకోలేదు. తన తప్పు తను తెలుసుకుని వచ్చి క్షమాపణ చెప్పినప్పుడే తను నాతో కాపురం చేస్తుంది అనుకుని నేను కూడా వదిలేసాను. దానికి కాలమే పరిష్కారం చూపిస్తుంది" అన్నాడు బాధగా.

"లేదు ఆనంద్. అంత తేలిగ్గా తీసుకోకు. జీవితం భగవంతుడిచ్చింది ప్రయోగాలు చేయడానికో లేక పగలు, ప్రతీకారాలు తీర్చుకోవడానికో కాదు.

ఎందుకు చెప్తున్నానో అర్థం చేసుకో. నేను అనుభవించిన బాధ పగవారికి కూడా వుండకూడదని భగవంతుడిని కోరుతున్నా" అన్నాడు రవికిరణ్.

"ఏంటి రవికిరణ్! ఏమైంది? ఎందుకు అంతగా బాధ పడుతున్నావు నువ్వు.. ఏమవుతుంది చెప్పు. రేపు కాకపోతే ఎల్లుండి తనే వస్తుంది. రాకపోతే ఏమవుతుంది? నేను తనకు కావలనుకున్నప్పుడు తనే వస్తుంది. దానికి నేను బాధ పడాల్సిన అవసరం ఏముంది?" అని జరిగిన విషయం అంతా వివరించాడు ఆనంద్.

"నువ్వు చెప్పింది నిజమే కానీ ఆనంద్ ఆమె చెప్పింది కూడా నువ్వు అర్థం చేసుకోవాలి కదా. పెళ్లిరోజు భార్య కోరిక తీర్చటం కూడా నీ బాధ్యతే కదా" అన్నాడు రవికిరణ్. "నిజమే రవికిరణ్, నువ్వు చెప్పింది అక్షరాలా నిజమే! నేను కాదనను. కానీ నేను కూడా వెళదామనుకున్నా. తీరా ఆఫీసు నుండి ఇంటికి బయలుదేరాక ఆఫీసులో బాస్ పిలిచారు.

"అనుకోకుండా హెడ్ ఆఫీసు నుండి ఫోను వచ్చింది. రిపోర్టు ఈ రోజే పంపించాలి అన్నారు. ఆ పని నేను తప్ప మరొకరు చేసేది కాదు. నాకు కనీసం మూడు గంటలు పడుతుంది. నేనేం చెయ్యాలి నువ్వు చెప్పు. నా భార్య సినిమా కోసం రానా లేక నాకు అన్నం పెట్టే ఉద్యోగం కోసం ఉండిపోవడం మంచిదా అని చాలాసేపు ఆలోచించాక సమయంలో ఆ పని పూర్తి చెయ్యడమే నాకు మంచిదనిపించింది.

అందుకే ఆ పని అది పూర్తి చేసుకొని వచ్చేసరికి లేటయింది. వచ్చి రాగానే తను అలా అరిచేసరికి నాకు చాలా కోపం వచ్చింది. అయినా నేనేమీ ఒక్క మాట కూడా అనలేదు. చెప్పు.. నాది తప్పంటావా?" అడిగాడు ఆనంద్.

"ఇప్పుడు కచ్చితంగా తప్పే" అన్నాడు రవికిరణ్.

"ఎందుకవుతుంది?"

"వస్తానని రాలేకపోయినపుడు ఆమెకు కనీసం ఫోను చేసి విషయం చెప్పి వుంటే అంత బాధ పడేది కాదుగదా. ఆమె నీ కోసం ఎదురు చూస్తుందనే విషయం నీకు తెలుసు. అటువంటప్పుడు నువ్వు ఆమెకు రావటం ఆలస్యం అవుతుందని ముందుగా తెలిపి వుంటే ఆమె ఇంతగా గొడవ చేసేది కాదు. కాబట్టి ఆమె తప్పు ఎంత వుందో నీ తప్పు కూడా అంతే వుంది" అన్నాడు రవికిరణ్.

"నేను పని బిజీలో చెప్పలేకపోయి వుండవచ్చు. కానీ నన్ను భర్త అని చూడకుండా అలా మాట్లాడి వెళ్లిన ఆమెను నేను మళ్లీ తీసుకురావాలా, కావాలనుకుంటే తనే వస్తుంది. అప్పటివరకు నేను కూడా పట్టించుకోను" అన్నాడు ఆనంద్ కోపంగా.

"అలా అనకు ఆనంద్. నేను స్వీయానుభవంతో చెప్తున్నాను. నా మాట విను. నా భార్య అనారోగ్యంతో నన్ను వదిలి పైకి వెళ్లిపోయింది. అప్పటి నుండి నా బాధ వర్ణనాతీతం.

**"నేను పని బిజీలో చెప్పలేకపోయి వుండవచ్చు. కానీ నన్ను భర్త అని చూడకుండా అలా మాట్లాడి వెళ్లిన ఆమెను నేను మళ్లీ తీసుకురావాలా, నేను కావాలనుకుంటే తనే వస్తుంది. అప్పటివరకు నేను కూడా పట్టించుకోను" అన్నాడు ఆనంద్ కోపంగా.**

తనను మర్చిపోలేక మరొకరిని చేసుకోలేక, ఒకవేళ నేను మళ్లీ పెళ్లి చేసుకున్నా పిల్లలను చూస్తారనే నమ్మకం లేక ఎంత బాధ పడుతున్నానో తెలుసా. ఎదురుగా వున్నప్పుడు మన జీవితం విలువ తెలుసుకోలేకపోతున్నాం. మనం అనుభవించకుండా ఎంతో సమయం వృథా చేసుకుంటున్నామేమో అనిపిస్తుంది. మనకు ఎదురుగా వున్నపుడు దాని విలువ తెలియదు. లేనప్పుడే కావాలనిపిస్తుంది. ఆ బాధ చెప్తే తప్ప అర్థం కాదు. అది అనుభవించిన వారికే తెలుస్తుంది" అన్నాడు, రవికిరణ్ కళ్లు తుడుచుకుంటూ బాధగా.

మరో మాట మాట్లాడకుండా ఆలోచనలో పడ్డాడు ఆనంద్. సాయంత్రం వరకు వుండి రవికిరణ్ వెళ్లిపోయాడు. ఆనంద్‌కు టీవీలో నుండి ఏవో మాటలు వినిపిస్తున్నాయి.... చాగంటి వారి ప్రవచనం వస్తోంది. "రాముడు మితభాషి, స్మితభాషి, అంతేకాదు హితభాషి,

పూర్వభాషి కూడా. పూర్వభాషి అంటే అవతలి వాళ్లు పలకరించకముందే తాను ముందుకు వెళ్లి పలుకరించే గొప్ప సంస్కారి. అందుకే పూర్వభాషి అంటారు. అది అందరికీ రాదు. అది గొప్పవారికి మాత్రమే సాధ్యమయ్యే విషయం.." అని చెప్తూ వున్నాడు. ప్రవచనం వింటూ రాధ గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు, ఆనంద్.

..................

అమ్మగారింట్లో రెండు రోజులు గడిపిన రాధకు ఏదో బాధగా వుంది. అమ్మ నాన్న తన గురించి అడగడం లేదు. ఎందుకు వచ్చావు అనిగాని, ఏం జరిగింది అని గాని అడగక పోవడం ఎంతో బాధగా వుంది. తనకు సలహాలు ఇస్తారని ఎంతగానో ఊహించింది. కానీ అడగకపోయినా తనను వెళ్లమని మాత్రం అనలేదు కదా! అని తనకు తనే సర్దిచెప్పుకుంది.

ఆ రోజు రాత్రి తన గదిలో నిద్రపోతున్నా అర్ధరాత్రి మెలుకువ వచ్చింది. దప్పికవుతోంది. మంచినీళ్లు తెచ్చుకోవడం మర్చిపోయింది. మంచినీళ్లు తెచ్చుకుందామని హాలులోకి వెళ్లింది.

హాలులోకి వెళ్లగానే అమ్మ నాన్నతో మాట్లాడుతున్న మాటలు వినపడుతున్నాయి. "ఏమండీ, మీరు ఏమీ తినకుండా పడుకున్నారు, కనీసం కొద్దిగా పలహారమైనా తీసుకోండి లేకపోతే నీరసం వస్తుంది" అంటోంది అమ్మ.

"లేదు పార్వతీ, మన అమ్మాయి కాపురం చక్కబడేంతవరకు నేను రాత్రిపూట ఏమీ తినకూడదని బాబా ఎదుట నిర్ణయం తీసుకున్నాను. ఇకపై నన్ను ఈ విషయంలో బలవంతం చేయకు" నాన్న చెప్తున్నాడు.

"అలా అనకండి.. ఏమీ తినకపోతే నీరసం వస్తుందండి. మీరు కనీసం అమ్మాయితో మాట్లాడి ఏమైందో కనుక్కొని, నచ్చచెప్పి పంపితే బాగుంటుంది కదా ఇలా ఉపవాసాలు ఉండకపోతే" అంది అమ్మ.

"కొత్తగా పెళ్లయిన దంపతులు వాళ్లు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. అంతేకానీ వాళ్ల విషయాలలో మనం తలదూర్చితే వాళ్ల మధ్య మరింత గ్యాప్ పెరిగి గొడవలు పెద్దవవుతాయి. వాళ్ల బాధలు వాళ్లు పడి, ఒకరికొకరు వాళ్లు ఒకరినొకరు అర్థం చేసుకుంటే అనుభవం వస్తుంది. కాపురం పట్ల నమ్మకం గౌరవం పెరుగుతాయి. వాళ్ల సంసారం బాగుంటుంది అంతేకానీ ప్రతిదానికి మనం తలదూర్చకూడదు" చెప్తున్నాడు నాన్న. ఆ మాటలు విన్న రాధకు చెంప చెళ్లుమనిపించినట్లుగా అనిపించింది. అంటే అమ్మ నాన్న వాళ్లు మా భార్యాభర్తల విషయంలో కలుగచేసుకుంటే అది పెద్ద విషయం అవుతుందని, విషయం తెలిసినా కూడా తెలియనట్లే ప్రవర్తిస్తూ ఎంత బాధపడుతున్నారు. నాన్నకు తనంటే ఎంత ప్రాణం. "పెళ్లి కాకముందు ఓ రోజు తలనొప్పి అంటే టాబ్లెట్ ఇచ్చి, పెళ్లయ్యాక నీకు మందు

"అంతా బాగున్నారండీ, మీరెలా వున్నారు?" గబుక్కున అడిగేసింది. "నాకేమి నేను బాగా బాగానే వున్నాను. ఈరోజు నువ్వు రెస్ట్ తీసుకో. నేను వంట చేస్తాను" అని వెళ్లి వంట చేయడం మొదలుపెట్టాడు ఆనంద్.

గోలీలు ఎవరిస్తారు నాన్న?" అని అడిగితే–

"నీకు పెళ్లయ్యాక నువ్వు సంతోషంగా వున్నానని చెప్తే అంతే చాలు తల్లీ. నేను మందులు వాడకపోయినా పర్వాలేదమ్మా. నాకు, నా ఆరోగ్యానికి ఏమీ దిగులుండదు. నీ కోసం, నీ సంతోషం కోసమే నేనెప్పుడూ ఆలోచించేది" అన్నాడు నాన్న. అమ్మ తన సంతోషాన్ని, బాధని వ్యక్తం చేస్తుంది. కానీ నాన్న మనసు ఎంతో లోతైనది.. ఏదీ బయటపడడు. తనకు తనే బాధపడతాడు. అటువంటి నాన్నను ఎంత బాధపెట్టాను. ఇకపై ఒక్క పూట కూడా నాన్న తన కోసం పస్తు వుండకూడదు... అని ఆలోచిస్తూ ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా? అని ఎదురు చూస్తూ కూర్చుంది.

తెల్లవారగానే లేచి బట్టలు సర్దుకుని అమ్మ దగ్గరకు వెళ్లి అమ్మకు నాన్నకు ఇద్దరికీ వినిపించేలా "అమ్మా రాత్రి ఆయన కలలో కనిపించాడు. ఎంతో ఇబ్బంది పడుతున్నాడు. పాపం అనిపించింది. ఉగాదికి ఆయనను కూడా తీసుకొని వస్తా" అంటూ చెప్పులు తొడుక్కుంటూ వుండగా– "ఒక్క నిమిషం ఉండమ్మా బొట్టు పెడతా" అని అమ్మ ఆనందంగా వచ్చి బొట్టు పెట్టి పండు చేతికిస్తే– నాన్న "ఈ అయిదు వందలు తీసుకోమ్మా దారి ఖర్చులకి వుంటాయి" అని వెలుగుతున్న ముఖంతో సాగనపంపాడు.

బయలుదేరి బయటకు వచ్చిందేగానీ ఎంతో కంగారుగా ఉంది. ఆయన ఏమంటాడో! ఎందుకు వెళ్లావు, ఎందుకు వచ్చావు? అని హేళన చేస్తాడేమోనని భయపడుతోంది. అసలు రానిస్తాడో లేదో! ఆ రోజు అలిగి చెప్పకుండా వెళ్లిపోయింది. ఇప్పుడు తనంతట తనే మళ్లీ తిరిగి వస్తోంది. ఏమంటాడో" అనుకుంటూ ఆలోచిస్తూ గేటు బయటకు వచ్చింది. అంతే! ఎదురుగా బైకు మీద ఆనంద్ వస్తూ కనిపించాడు. ఎంతో సంతోషం వేసింది. మాట్లాడకుండా వెనుక ఎక్కి కూర్చుంది. ఇంటికి వచ్చాక లోపలికి వచ్చి హాల్లో కూర్చుంది. పలుకరించాలా? వద్దా? ఆలోచిస్తోంది. ఇంతలో ఓ కప్పు కాఫీతో వచ్చాడు ఆనంద్.

"తీసుకో రాధా! కాఫీ తాగు. అమ్మా, నాన్న ఎలా వున్నారు?" అని అడిగేసరికి అయోమయంలో పడింది.

గబగబా కాఫీ తీసుకుని తాగుతూ "అంతా బాగున్నారండీ, మీరెలా వున్నారు?" గబుక్కున అడిగేసింది. "నాకేమి నేను బాగా బాగానే వున్నాను. ఈ రోజు నువ్వు రెస్ట్ తీసుకో. నేను వంట చేస్తాను" అని వెళ్లి వంట చేయడం మొదలుపెట్టాడు ఆనంద్.

రాధకు ఆనందం, ఆశ్చర్యం, అయోమయం అన్నీ కలగలిసిన అనుభూతి. అసలేమీ అర్థం కావడంలేదు.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అక్కడ అమ్మ నాన్నలు అడిగితే చెబుదామంటే వాళ్లు అడగలేదు. ఇక్కడకు వచ్చాక ఈయనకు సారీ చెప్పి, బతిమాలుకుందాంలే! అనుకుంటే ఈయన అసలు ఏమీ జరగనట్లు వ్యవహరిస్తున్నాడు. పరిస్థితి అర్థంకాక మతిపోయింది.

"ఏమండీ! నేను వంట చేయగలను. కానీ నేను మిమ్మల్ని అనకూడని మాటలు అని అలిగి వెళ్లి తప్పు చేశానని బాధపడుతుంటే మీరు ఒక్క మాట కూడా అనకుండా మీరే నన్ను పలకరించి కాఫీ కూడా ఇచ్చి వంటి చేయబోతున్నారు, ఏంటంటీ మీ వుద్దేశం?" అడిగంది ఆపుకోలేక ఆవేశంగా, బాధగా.

"రాధా! నేను కూడా ఒంటరితనాన్ని ఒక శిక్షగానే భావించాను. నా స్నేహితుడు రవికిరణ్ మన ఇంటికి వచ్చాడు. అతను భార్య లేక పడుతున్న బాధలు వింటుంటే చాలా బాధ వేసింది. పంతంతో, ఆవేశాలతో అనవసరంగా వివాదాలు పెంచుకుని కాపురాలు కూల్చుకోవడం అవివేకమనిపించింది. ఒక్కసారి కోపాన్ని పక్కకు పెట్టి ఎదుటి వ్యక్తి ఏ పరిస్థితిలో అలా మాట్లాడారో! అని ఆలోచిస్తే మన కొంత కోపం తగ్గుతుంది. ఎదుటివారు క్షమాపణ అడిగితే క్షమించడం గొప్పకాదు. క్షమాపణ అడగకముందే క్షమించడం గొప్ప విషయం, అప్పుడు క్షమాపణ అడిగేవారికన్నా ముందే క్షమించేవారు ఒక మెట్టుపైనే వుంటారు కదా.

అందుకే ఎవరైనా కోపాలు తాపాలు లేకుండా ఒకరికొకరు అర్థం చేసుకుని సర్దుకుపోతే వారి జీవితానికి అర్థం ఉంటుంది అని చెప్తున్న ఆనంద్ ఒక ప్రవచనకర్తలా కనిపించాడు రాధకు.

"అందరూ మీలా ఆలోచిస్తే కూలిపోయే ఎన్నో కాపురాలు నిలబడతాయి కదండీ" అని రాధ అంటే–

"కాపురాలే కాదు, మనుషుల మధ్య మానవ సంబంధాలు కూడా ఎంతో మెరుగుపడతాయి" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

# ఏకాగ్రతను పెంచే పుస్తక పఠనం

**పుస్తకం** విద్యార్థితో చేసే సంభాషణలో ఒక గొప్ప జీవిత సత్యం దాగి ఉంది.. "నీవు నన్ను తలవంచి చదివితే, నేను నిన్ను తలెత్తుకొని జీవించేలా చేస్తాను." ఈ మాటలు కేవలం ఒక అలంకార ప్రయోగం కాదు; ఇది విద్య అసలైన విలువను, క్రమశిక్షణను, మనిషి వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతిబింబించే శాశ్వత సందేశం. ఈ భావనను ఆధారంగా చేసుకుని చూస్తే, పుస్తకం అనేది కేవలం కాగితం కట్ట కాదు, అది ఒక మార్గదర్శి, ఒక మౌన గురువు, ఒక జీవిత స్నేహితుడు.

వేగవంతమైన ఇప్పటి ప్రపంచంలో, విద్యార్థుల దృష్టి చాలా



సార్లు తాత్కాలిక విజయాలపై, మార్కులపై, లేదా ఉద్యోగ అవకాశాలపై మాత్రమే నిలుస్తోంది. కానీ పుస్తకం చెప్పే ఈ మాట మనకు గుర్తు చేస్తుంది నిజమైన విద్య అనేది కేవలం పరీక్షల్లో రాణించడమే కాదు; అది మన ఆలోచనా విధానాన్ని, మన సంస్కారాన్ని, మన జీవనశైలిని తీర్చిదిద్దే ప్రక్రియ అని. పుస్తకాన్ని గౌరవంతో, వినయంతో చదవడం అంటే జ్ఞానాన్ని స్వీకరించే మనసు కలిగి ఉండటం. అదే మనకు నిజమైన ఎదుగుదలను ఇస్తుంది.

"తలవంచి చదవడం" అనే పదబంధంలో ఒక లోతైన అర్థం ఉంది. అది కేవలం భౌతికంగా తలవంచడం కాదు; అది అహంకారాన్ని పక్కన పెట్టి నేర్చుకోవాలనే తపన. మనకు తెలిసినదానికంటే తెలియనిది ఎక్కువ అని అంగీకరించడం. ఈ వినయం లేకుండా ఎలాంటి విద్యా ప్రయాణం సంపూర్ణం కాదు. ఎందుకంటే, జ్ఞానం అనేది ఎప్పటికీ ముగియని సముద్రం, మనం ఎంత నేర్చుకున్నా ఇంకా తెలుసుకోవాల్సింది చాలా ఉంది.

మరోవైపు, "తలెత్తుకొని జీవించడం" అంటే ఆత్మవిశ్వాసంతో, గౌరవంతో, సమాజంలో ఒక స్థానం సంపాదించుకోవడం. పుస్తకాలు మనకు ఇచ్చే జ్ఞానం మనలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది. అది మనకు సరైన నిర్ణయాలు తీసుకునే శక్తిని ఇస్తుంది. ఒక విద్యార్థి తన విద్యను నిజాయితీగా ఆచరించినప్పుడు, అతను కేవలం తన వ్యక్తిగత విజయానికే కాదు, సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడతాడు.

ఇప్పుడు డిజిటల్ యుగంలో, పుస్తకాల స్థానాన్ని గాడ్జెట్లు, సోషల్ మీడియా ఆక్రమిస్తున్నాయి. సమాచారాన్ని పొందడం సులభమైంది, కానీ జ్ఞానాన్ని పొందడం మాత్రం కష్టమైంది. ఎందుకంటే, సమాచారం తాత్కాలికం, కానీ జ్ఞానం శాశ్వతం. పుస్తకాలు మనకు లోతైన ఆలోచనలను, విశ్లేషణాత్మక దృష్టిని అందిస్తాయి. అవి మనలో ఓపికను పెంచుతాయి, ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. ఈ లక్షణాలు లేకుండా నిజమైన విజయం సాధ్యం కాదు. ఈ సందర్భంలో, విద్యార్థులు తమ దైనందిన జీవితంలో పఠనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. రోజుకు కొంత సమయం పుస్తకాలతో గడపడం ఒక అలవాటు కావాలి. అది పాఠ్యపుస్తకాలు కావచ్చు, సాహిత్యం కావచ్చు, చరిత్ర లేదా విజ్ఞాన శాస్త్ర పుస్తకాలు కావచ్చు ప్రతి పుస్తకం మనకు ఏదో ఒక కొత్త దృష్టికోణాన్ని ఇస్తుంది. ముఖ్యంగా, మన సంస్కృతి, విలువలను ప్రతిబింబించే సాహిత్యాన్ని చదవడం ద్వారా మన వ్యక్తిత్వం మరింత సంపూర్ణంగా మారుతుంది.

అలాగే, గురువులు, తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో కీలక పాత్ర పోషించాలి. వారు పిల్లల్లో పఠనపు అలవాటు పెంపొందించడానికి ప్రోత్సహించాలి. పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం, చదివిన విషయాలపై చర్చించడం, గ్రంథాలయాలకు తీసుకెళ్లడం.. వంటి చర్యలు విద్యార్థుల్లో చదవాలనే ఆసక్తిని పెంచుతాయి. ఇది వారి భవిష్యత్తును నిర్మించే బలమైన పునాది అవుతుంది.

చివరగా.. ఈ వాక్యం మనకు ఒక స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని ఇస్తుంది: కష్టపడి చదవడం, వినయంతో నేర్చుకోవడం, జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడం. ఇవే మనలను సమాజంలో గౌరవప్రదమైన స్థాయికి తీసుకెళ్తాయి.

పుస్తకం ఇచ్చే ఈ సందేశాన్ని మన జీవిత సూత్రంగా స్వీకరిస్తే, మనం కేవలం విజయవంతులే కాకుండా విలువలతో కూడిన వ్యక్తులుగా మారగలుగుతాం.

అందుకే, ప్రతి విద్యార్థి తన మనసులో ఈ మాటలను చెక్కించుకోవాలి "పుస్తకాన్ని గౌరవించు, అది నిన్ను గౌరవంగా నిలబెడుతుంది" ఇదే నిజమైన విద్య, ఇదే నిజమైన విజయం. అందుకే, ప్రతి విద్యార్థి తన మనసులో ఈ మాటలను చెక్కించుకోవాలి "పుస్తకాన్ని గౌరవించు, అది నిన్ను గౌరవంగా నిలబెడుతుంది". ఇదే నిజమైన విద్య. ఇదే నిజమైన విజయం.

**- తిప్పర్తి శ్రీనివాస్**

# తెలంగాణలో చారిత్రక కోటలు

**తెలంగాణ** సంస్కృతి, సంప్రదాయాలు, వైభవం, నాగరికత ఇత్యాది వాటి గురించి చెప్పేవాటిలో తెలంగాణ కోటలు ప్రముఖమైనవి. ఈ కోటలలో అప్పటి రాజులు వేయించిన శాసనాలు, నాణేలతో పాటు వారు రాజ్య పరిపాలన సాగించిన తీరుతెన్నులు, శత్రుదుర్భేద్యంగా నిర్మించిన రాతి గోడలు అబ్బురపరిచే వాటి నిర్మాణశైలి.. ఇలా ఎన్నో ఈ కోటల ద్వారా తెలుస్తాయి. అంతేకాకుండా ఏయే రాజవంశీయులు తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించారో వారి ఆచార వ్యవహారాలు, వారు వాడిన వస్తువులు, దుస్తులు, ఆయా రాజుల కళాపోషణ, నాటి శిల్పకళా వైభవం, అద్భుతమైన రాతికట్టడాలు తదితర అంశాలు గత చరిత్రకు సాక్షీభూతంగా ఈ కోటలలో నెలకొని ఉన్నాయి. కొన్ని కోటలు పర్యాటక కేంద్రాలుగా మారి నేటికీ ప్రజలకు ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి.

## గోల్కొండ కోట



హైదరాబాద్ నగరానికి గర్వకారణం, చారిత్రక వారసత్వ సంపద ఈ గోల్కొండ కోట. దీని వెనుక వందల ఏళ్ల చరిత్ర, అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యం దాగి ఉన్నాయి. 13వ శతాబ్దంలో కాకతీయులు ఈ కోటను నిర్మించారు. బాలుడైన ఒక గొర్రెల కాపరికి కొండపై ఒక విగ్రహం దొరికిందట. ఆ విషయాన్ని అప్పటి రాజుకు చెప్పడంతో అక్కడ మట్టి కోట కట్టారు. గొల్లవాడికి దొరికిన కొండ కాబట్టి దీనికి 'గొల్లకొండ' అనే పేరు వచ్చింది. కాలక్రమేణా అది గోల్కొండగా మారింది. 14వ శతాబ్దం చివరలో ఈ కోట బహమనీ సుల్తానుల వశమైంది. వారు ఈ కోటను మరింత విస్తరించారు. బహమనీ సామ్రాజ్యం ముక్కలైనప్పుడు, సుల్తాన్ కులీ కుతుబ్ షా గోల్కొండను కేంద్రంగా చేసుకుని స్వతంత్ర పాలనను ప్రారంభించాడు. గోల్కొండ కోట అసలైన వైభవం కుతుబ్ షాహీ వంశం (1518-1687) పాలనలోనే స్వర్ణయుగంలా వెల్లివిరిసింది. ఈ కాలంలో మట్టి కోటను బలిష్టమైన రాతి కోటగా మార్చారు. ఆ కాలంలో గోల్కొండ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వజ్రాల వ్యాపార కేంద్రంగా ఉండేది. ప్రపంచ ప్రఖ్యాత కోహినూర్ వజ్రం, హోప్ డైమండ్ వంటివి ఇక్కడి నుంచే వెలుగులోకి వచ్చాయి. కళలు, సంస్కృతి తెలుగు, పర్షియన్ భాషలు ఇక్కడ సమానంగా గౌరవం పొందాయి.

ఇది శత్రువుల రాకను గుర్తించడానికి వాడే సాంకేతికత. కొండపైకి నీటిని తరలించే నీటి సరఫరా, అద్భుతమైన పైపులైన్ వ్యవస్థ నేటికీ ఆశ్చర్యపరుస్తుంది. భక్త రామదాసు (కంచెర్ల గోపన్న)ను ఈ కోటలోనే బంధించారు. ఆయన చెరసాలలో ఉన్నప్పుడు గోడలపై చెక్కిన విగ్రహాలను మనం ఇప్పటికీ చూడవచ్చు. కోట మొత్తానికి బాహ్య గోడలు సుమారు 10 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. గోల్కొండ కోటలో సాయంత్రం వేళ జరిగే 'లైట్ అండ్ సౌండ్ షో' పర్యాటకులకు అత్యంత ఇష్టమైన ఆకర్షణ. లేజర్ షో ద్వారా కోట గోడలపై పడే రంగురంగుల కాంతి కిరణాలు ఒక మాయా ప్రపంచాన్ని సృష్టిస్తాయి.



## చంద్రగఢ్ కోట

మహబూబ్ నగర్ జిల్లాలోని చారిత్రక కట్టడాలలో చంద్రగఢ్ కోట చాలా ప్రత్యేకమైనది. ప్రకృతి ఒడిలో, కృష్ణా నది తీరాన ఉన్న ఈ కోట శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా ఆత్మకూరు మండలం, జూరాల ప్రాజెక్టు సమీపంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న చారిత్రక కట్టడం చంద్రగఢ్ కోట. మహబూబ్ నగర్ పట్టణం నుండి సుమారు 60 కి.మీ దూరంలో ఆత్మకూరుకు చేరుకోవడానికి 10 కి.మీ ముందు చంద్రగఢ్ వెళ్లే దారి కనిపిస్తుంది. ఈ కోటను 18వ శతాబ్దంలో నారాయణపేట సంస్థానాధీశులు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పాలించిన చంద్రసేన అనే రాజు పేరు మీద దీనికి 'చంద్రగడ్' అనే పేరు వచ్చింది. ఈ కోట కృష్ణా నది ఒడ్డున ఒక ఎత్తైన కొండపై ఉంది. ఇక్కడి నుండి చూస్తే జూరాలా ప్రాజెక్ట్ వెనుకభాగం నీరు కనిపిస్తూ ఎంతో అద్భుతంగా ఉంటుంది. కొండపై ఉన్న కోట గోడలు, బురుజులు ఇప్పటికీ పటిష్టంగా ఉన్నాయి.

ఈ కొండపైకి వెళ్లడానికి రాతి మెట్లు ఉన్నాయి. కోట లోపల పురాతనమైన రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. కొండపై వర్షపు నీటిని నిల్వ చేయడానికి రాతిని తొలిచి వేసిన నీటి కుంటలు (చెరువులు) కనిపిస్తాయి. ఇవి అప్పటి ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం.

## ఓరుగల్లు కోట



తెలంగాణ చరిత్రలో ఓరుగల్లు(వరంగల్) కోటకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఓరుగల్లు అంటే ఒకే రాయి అని అర్థం. ఒకే పెద్ద శిల (ఏకశిల) పై ఈ కోట నిర్మించడం వల్ల ఈ పేరు వచ్చింది. ఓరుగల్లు కోట శత్రువులకు అంత సులభంగా చిక్కకుండా మూడు అంచెల రక్షణ వలయాలతో నిర్మించారు. గ్రానైట్ రాళ్లతో నిర్మించిన బలమైన గోడ, దీని చుట్టూ లోతైన నీటి కందకం ఉండేది. బాహ్య వలయాన్ని దాదాపు 12.5 మైళ్ల చుట్టుకొలతతో మట్టితో నిర్మించిన గోడ, అంతర్గత వలయాన్ని రాజకుటుంబీకులు, సైన్యం నివసించే ప్రధాన కేంద్రం. కోటలోని నాలుగు దిక్కుల ఉన్న అద్భుతమైన తోరణాలు కాకతీయుల శిల్పకళకు చిహ్నాలు. వీటినే నేడు తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంగా వాడుతున్నారు.

## రామగిరి ఖిల్లా

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా, కమానపూర్ మండలం బేగంపేట గ్రామ సమీపంలో ఉన్న రామగిరి ఖిల్లా (రామగిరి దుర్గం) 12వ శతాబ్దంలో కాకతీయులచే నిర్మితమై చారిత్రక ప్రాధాన్యత కలిగిన కోట. తెలంగాణలోని అతి పురాతనమైన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన కోటలలో రామగిరి ఖిల్లా ఒకటి. దీనిని రామగిరి కోట అని కూడా పిలుస్తారు. ఈ కోట నిర్మాణంలో కాకతీయుల శైలి స్పష్టంగా కనిపిస్తుంది. కాకతీయుల తర్వాత ఈ కోట బహుమనీ సుల్తానులు, కుతుబ్ షాహీలు, చివరకు నిజాంల ఆధీనంలోకి వెళ్లింది. కొండపై ఎన్ని రోజులు ఉన్నా నీటి కొరత రాకుండా ఏనుగుల చెరువు, గుర్రాల చెరువు వంటి కొలనులను నిర్మించారు.

## గద్వాల కోట

ఈ కోట గద్వాల్ పట్టణం నడిబొద్దున ఉంది. దీనిని రాజా పెద్ద సోమభూపాలుడు 1662లో నిర్మించాడు. గద్వాల్ సంస్థానాధీశులు విద్యావంతులుగా, కళా పోషకులుగా ప్రసిద్ధి చెందారు. గద్వాల్ పాలకులు నిజాం రాజులకు సామంతులుగా ఉన్నప్పటికీ, తమ ప్రాంతంపై పూర్తి పట్టు కలిగి ఉండేవారు. వీరు దాదాపు 300 యేళ్ల పాటు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. గద్వాల్ కోట కేవలం రక్షణ కోసం కట్టిన కట్టడం మాత్రమే కాదు, అది అద్భుతమైన వాస్తుశిల్పానికి ప్రతీక. కోట లోపల అందమైన భవనాలు, చెక్కతో చేసిన స్తంభాలు కనిపిస్తాయి. ఈ కోటలో దక్షి ణాదిలోనే అతిపెద్దదైన ఒక భారీ ఇనుప ఫిరంగి ఉంది.

## మెదక్ కోట

తెలంగాణలోని చారిత్రక కట్టడాలలో మెదక్ కోట చాలా విశిష్టమైనది. శత్రుదుర్భేద్యమైన నిర్మాణానికి, కాకతీయుల కళా నైపుణ్యానికి ఇది ఒక సజీవ సాక్ష్యం. ఒకప్పుడు ఇది కాకతీయులకు పడమర దిశలో ఒక ప్రధాన రక్షణ కేంద్రంగా ఉండేది. దీనిలోకి వెళ్లడానికి మూడు ప్రధాన ద్వారాలు ఉన్నాయి. కోటలోకి ప్రవేశించే మొదటి ద్వారం పేరు ప్రతాపరుద్ర ద్వారం. సింహ ద్వారానికి రెండు వైపులా గంభీరమైన సింహాల విగ్రహాలు ఉంటాయి. ఏనుగుల శిల్పాలతో అలంకరించబడినది గజ ద్వారం. కోటపై 3.2 మీటర్ల పొడవున్న భారీ ఫిరంగి ఉంది. ఇది 17వ శతాబ్దానికి చెందిన ఫిరంగి అని తెలుస్తుంది. ఇది అప్పట్లో రక్షణ వ్యవస్థ ఎంత బలంగా ఉండేదో తెలుస్తోంది. యుద్ధ సమయంలో సైన్యానికి ఆహార కొరత లేకుండా ధాన్యం నిల్వ చేసే గదులు ఇక్కడ చూడవచ్చు.

తెలంగాణాలో ఇంకా అనేక కోటలు ఉన్నాయి. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న సిర్పూర్ కోట (సిర్పూర్ ఫోర్ట్)ను గోండు రాజు భీమ్ బల్లాల్ సింగ్ నిర్మించారు. ఇది సుమారు 870వ ప్రాంతానికి చెందినదని చరిత్రలో ఆధారాలు ఉన్నాయి. నిజామాబాద్ కోటను నిజామాబాద్ ఖిల్లా అని కూడా పిలుస్తారు. ఈ ఖిల్లా నిజామాబాద్ నగరంలో ఉంది. ఇది రాష్ట్రకూట రాజులు చేత 10వ శతాబ్దంలో నిర్మితమైంది. నిర్మల్ కోట నిర్మల్ పట్టణ పరిధిలో ఉంది. నిర్మల్ కోటను ప్రధానంగా శ్యామ్‌గఢ్ కోట, నిర్మల్ ఫోర్ట్ పిలుస్తుంటారు. దీన్ని 1650లో శ్రీనివాసరావు ఆధీనంలో ఆసఫ్ జాహీల కాలంలో నిర్మించారు. ఈ కోటను ఫ్రెంచ్ ఇంజనీర్ల సహాయంతో నిర్మించినట్లు తెలుస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం, ప్రతాపగిరి గ్రామంలో ప్రతాపగిరి కోట ఉంది. కాకతీయుల కాలంలో



ప్రతాపరుద్రదేవుడు హయాంలో ఉపయోగించడం వల్ల దీనికి 'ప్రతాపగిరి' అని పేరు వచ్చింది. దేవరకొండ పట్టణంలోని దేవరకొండ కోట, భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణంలో ఉన్న గిరి దుర్గం భువనగిరి కోట.. ఇలా అనేక కోటలు తెలంగాణాలో పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

**– షేక్ అబ్దుల్ హాకీం జాని**




వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458




# ముఖద్వారం ఏ వైపు ఉండాలి?

**వీరయ్య, గుంటూరు**

**ప్రశ్న: నేను ప్రస్తుతం పశ్చిమ ముఖద్వారం వున్న ఇంట్లో అద్దెకు ఉంటున్నాను. ఇప్పటి ఇంటి ద్వారం దక్షిణం వైపుకు ఉన్నది. నన్ను ఏ వైపు ముఖద్వారం వున్న ఇంట్లో ఉండమంటారు?**

**జవాబు:** పడమర లేదా దక్షిణ ముఖద్వారం వున్న గృహం మీకు యోగిస్తుంది.

## జీవితమంటే ఇంతేనా?

**ప్రశ్న: ఎన్నని చెప్పను? మీ మీద పూర్తి నమ్మకంతో రాస్తున్నాను. 'జీవితమంటే ఇంతేనా?' అనిపిస్తోంది.**

**జవాబు:** ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఎప్పుడో ఒకప్పుడు 'ఇంతేనా జీవితం' అనిపిస్తుంది. అదేదో మీకు ఈరోజు అనిపిస్తున్నది.. అంతే! కొంత కాలానికి మీరు మళ్ళీ మామూలుగా మారిపోతారు. ఎక్కువ టైమ్ తీసుకోకుండా కాస్త త్వరగా మామూలు స్థితికి రావాలని కోరుకుంటున్నాను.

మీరొక చిన్న పని చేయండి. మీ రిస్ట్ వాచ్‌లో, సెల్‌ఫోన్‌లో, గోడ గడియారంలో కూడా సమయాన్ని ఐదు నిమిషాలు ముందుకు సర్దిపెట్టండి. ప్రతిరోజూ నిద్ర లేచాక ఈశాన్యం వైపుకు నాలుగైదు అడుగులు నడవండి. నాలుగైదు రోజుల్లో మీరు ఎంతో రిలీఫ్ పొందుతారు. చేసి చూడండి.

## ఏం చేయమంటారు?

**ఎన్.వి, నంద్యాల**

**ప్రశ్న: నేను పంపించిన ప్లాన్ ఎలా ఉంది? ఇది మా వంశపారంపర్యంగా వస్తున్న స్థలం. తరాలు మారాయి. దక్షిణం వైపు స్థలం తగ్గిస్తే ఇంటి నిర్మాణం వీలుకాదు. మా ఇంట్లో ఎదుగుదల లేదు. ఏం చేస్తే బాగుంటుంది? ప్రత్యామ్నాయ మార్గాలు సూచించగలరు.**

**జవాబు:** 1) ఆగ్నేయం తగ్గిన స్థలం. 2) దండాకార స్థలం(ఎక్కువ పొడవైనది). 3) తూర్పు భుజం కంటే పడమర భుజం ఎక్కువగా ఉన్న స్థలం.

ఈ మూడు కారణాల వల్ల ఈ ఇల్లు లేదా స్థలం విసర్జింపదగినది. ప్రత్యామ్నాయ మార్గాలు పాటించకండి.

## సమస్యలు పరిష్కారం?

**కె.శ్రీనివాస్, కొత్తకోట**

**ప్రశ్న: మా ఇంటి ప్లాను ప్రకారం రెండు అంతస్థులుగా ఉన్నది. ప్లాను ప్రకారం ఏమైనా వాస్తు దోషాలున్నాయా? నేను ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాను. నా ముగ్గురు మొగపిల్లలలో ఎలాంటి అభివృద్ధి లేదు. పిల్లల చదువులు పదవ తరగతి, ఇంటర్‌తో ఆగిపోయాయి. ఏ పని చేయాలన్నా ఇష్టపడటం లేదు. మేం ఏదన్నా అంటే అలిగి, ఇంట్లో నుండి వెళ్లిపోతున్నారు.**

**జవాబు:** వీధి మింగిన స్థలం/గృహంలో నివసించటం వల్ల ఇలాంటి అనేక సమస్యలను ఎదుర్కోవల్సి వస్తుంది. బాధ్యతగల ఇంటిపెద్దలు ఏమీ చేయలేకపోతారు. బాధ్యతల గల పిల్లలు బాధ్యతలు మరిచి కాలాన్ని వృథా చేస్తారు.

ఈ వాస్తు దోషాన్ని సవరించటానికి వీలుకాదు. ప్రత్యామ్నాయ పద్ధతులు (రెమిడీస్) ఉన్నాయి. మమ్మల్ని సంప్రదించి/గృహం చూపించిగానీ, రెమిడీస్ ఉపయోగించి దోష తీవ్రతను తగ్గించుకోవచ్చు. తద్వారా సమస్యల తీవ్రత కూడా తగ్గుతుంది. ■

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ..........................................

పుట్టిన తేది : ..........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................

చిరునామా:..............................................

> మౌనం నిద్ర వంటిది. ఎందుకంటే అది బుద్ధిని వాడిపోనివ్వదు. – బేకన్

# కొలనుభారతి నిజరూపం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణానికి 21 కిలోమీటర్ల దూరంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న సరస్వతీదేవి ఆలయం కొలనుభారతిగా కొలువుదీరి ఆరాధనలు అందుకుంటోంది.

ఆత్మకూరు నుండి కొత్తపల్లి మీదుగా పదహారు కిలోమీటర్లు ప్రయాణించి, శివపురం గ్రామాన్ని చేరుకుని అక్కడి నుండి ఐదు కిలోమీటర్లు అడవిలో ప్రయాణించి ఈ ఆలయాన్ని దర్శించవచ్చు. శివపురం నుండి ఈ కొలనుభారతి ఆలయం వరకు వాహనాలు నడిచేందుకు వీలుగా రోడ్డు సౌకర్యం ఉంది. దట్టమైన అడవిలో పచ్చని చెట్లతో ప్రశాంత వాతావరణంతో ఈ కొలనుభారతి ప్రాంతం ఎంతో రమణీయంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. చారుఘోషిణి నది వద్ద ఈ కొలనుభారతి ఆలయం ఉంది. ఇక్కడే సప్త శివాలయాల పేరుతో ఏడు శివాలయాలున్నాయి.



కొలనుభారతి అతి ప్రాచీనమైన ఆలయం. 11వ శతాబ్ది నుండి ఈ ప్రాంత ఉనికి మనకు శాసనాల ద్వారా తెలుస్తోంది. అందుకు ఋజువుగా కొలనుభారతిలో కళ్యాణీ చాళుక్యుల కాలానికి చెందిన రెండు కన్నడ శాసనాలు లభించాయి. ఇక్కడ లభించిన శాసనాలలో సరస్వతి ఆలయ ప్రస్తావన లేదు. ఈ కొలనుభారతిని స్థానికంగా కోలన్ భారతి అని, కొల్లం భారతి అని పిలుస్తారు. 11వ శతాబ్దపు శాసనంలో ఈ ప్రాంతం 'కొల్ల'గా పేర్కొనబడింది. బహుశా కాలక్రమంలో 'కొల్ల' అనేది కొల్లంగా మారి కోలన్ గాను, కొలనుగాను అయి ఉండవచ్చు.

ఇక్కడ లభ్యమైన మొదటి శాసనం త్రైలోక్య మల్ల బిరుదాంకితుడైన మొదటి సోమేశ్వరుడిది. ఇతని పాలనాకాలం 1044 నుండి 1068. కాగా, 1057నాటి ఈ శాసనంలో ఈ రాజు తన రాణి మైలాలదేవితో కలసి శ్రీశైలాన్ని దర్శించి శ్రీశైల అధిదేవుడైన మల్లికార్జునస్వామి సాన్నిధ్యంలో సురేశ్వర పండితునికి కొల్లలోని స్వయంభు భైరవదేవుని సేవకు, సత్ర నిర్వహణకు, కన్నెమున్నూరు సీమలోని దుద్యాల గ్రామాన్ని, సారంగేశ్వర దేవుని సేవకు, సత్ర నిర్వాహణకు సిరిపురం గ్రామాన్ని, ఇందేశ్వర దేవుని సేవకు కురుకుంద గ్రామాన్ని దానంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక్కడ లభించిన మరో శాసనం త్రిభువన మల్లుడిది. ఇతడు 1076 నుంచి 1126 వరకు పాలించాడు. ఈ శాసనం అసంపూర్ణంగా లభించింది. ఈ శాసనం త్రిభువనమల్లుని సామంతరాజు అయిన బిజ్జన చోళ మహారాజును ప్రస్తావిస్తోంది.

కొలనుభారతిలో సరస్వతి ఆలయం ఎప్పుడు నిర్మించబడిందో కచ్చితంగా తెలియజేసే ఆధారాలు ఏవీ లభించలేదు. కానీ ఈ ప్రాంతం ఎంతో ప్రాచీనమైనదని, ఆ ప్రాంతం పేరుతోనే సరస్వతీదేవిని

'కొలను భారతి'గా పేర్కొనటం బట్టి చూస్తే ఈ ఆలయం ప్రాచీనమైనదనే చెప్పవచ్చు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన కొలనుభారతి ఆలయాన్ని 150 సంవత్సరాల క్రితం పునరుద్ధరించబడినట్లు తెలుస్తోంది. ఆలయ ద్వార బంధాలు, స్థంబాలు ప్రాచీనమైనవిగా చెప్పవచ్చు.

ఈ ఆలయం దగ్గరే ఉన్న సప్త శివాలయాల నిర్మాణ శైలినే పోలి ఉన్నాయి. అందుకే బహుశా ఈ ఆలయం కూడా చాళుక్యుల కాలంలోనో, అంతకు ముందో నిర్మించబడి ఉండవచ్చు. ఆ ఆలయం మైదాన ప్రాంతంలో కాక అడవిలో నిర్మించి ఉండటం చేత ప్రాచీనులు ఉపాసన, సాధన చేసుకునేందుకు వీలుగా జనారణ్యానికి దూరంగా కూడా నిర్మించి ఉండవచ్చు.

ఈ ఆలయంలోని ప్రాచీనమైన మూర్తి భిన్నం కాగా 200 సంవత్సరాల క్రితం మరో విగ్రహం చెక్కించి ప్రతిష్ఠించబడినట్లు, ఆ విగ్రహం కూడా భిన్నం కావటంతో ప్రస్తుతం పూజలందుకుంటున్న ఇప్పటి విగ్రహాన్ని 1950వ దశకంలో ప్రతిష్ఠించబడినట్లు చెబుతున్నారు.

ఇప్పుడు పూజలు జరుపబడుతున్న విగ్రహానికి అంతకు ముందు పూజలు చేసిన విగ్రహం ఇంచుమించు ఒకే విధంగా ఉన్నాయి కాబట్టి ప్రాచీన కాలంలో ఉన్న విగ్రహం కూడా ఈ విధంగానే ఉండి ఉంటుందని భక్తుల నమ్మకం.

కొలనుభారతిలోని సరస్వతీదేవి విప్పారిన కమలంపై పద్మాసన భంగిమలో ఆశీనురాలై, జటా మకుటాన్ని కలిగి ఉన్నట్లుగా ఉంటుంది. కర్ణాభరణములు,

నాభి పైభాగం వరకు కంఠాభరణాలు ధరించి నాలుగు చేతులలో కుడి వైపున కింది నుండి పైకి వరుసగా అభయహస్తం, అంకుశం, ఎడమవైపు కింది నుండి పైకి వరుసగా పుస్తకం, పాశాన్ని ధరించి ఉంటుంది. కటిసూత్రం కలిగి ఉన్న ఈ సరస్వతీదేవి ముంజేతికి కంకణాలు, పాదాలకు నూపురాలను ధరించి ఉంది. కొలనుభారతి అమ్మవారు కాశ్యప శిల్పశాస్త్రంలో చెప్పినట్లుగా జటామకుటాన్ని, స్వహస్తాలో అభయహస్తం, పుస్తకాన్ని ధరించి ఉండి, హస్తాలందు అక్షమాల, కమండాలనికి బదులుగా పాశాంకుశాలను ధరించినట్లుగా మలచి ఉంటారని భావించవచ్చు.

ఈ క్షేత్రంలో భారతీ అమ్మవారిని పూర్వం మహాభారత కాలంనాటి జనమేజయ మహారాజు ప్రతిష్ఠించినట్లు స్థల పురాణం చెబుతోంది. ఈ ఆలయం పల్లవుల కాలం నాటికే ఉండేదని, 11వ శతాబ్దంలో మల్లభూపతి అనే రాజు ఈ ఆలయాన్ని పునరుద్ధరించాడని కూడా చెబుతారు. దీనినిబట్టి చూస్తే ఐదారు శతాబ్దాల నాటికే ఉన్న ఈ ఆలయం కళ్యాణీ చాళుక్యుల కాలంలో పునరుద్ధరించబడి ఉంటుందని ఊహించవచ్చు.

ఈ ఆలయాన్ని శ్రీశైల దేవస్థానం వారు తమ పర్యవేక్షణలో దైనందిన పూజలను నిర్వహిస్తున్నారు. కొలనుభారతిలో ప్రతి యేటా 'వసంత పంచమి' ఘనంగా నిర్వహిస్తారు. దసరా పండుగ సందర్భంగా సరస్వతి నవరాత్రులు, శివరాత్రి ఉత్సవాలు, గురుపూర్ణిమ జరపటమేకాక ప్రతి పౌర్ణమి నాడు ప్రత్యేక పూజలు ఉంటాయి.

ఈ ఆలయం దట్టమైన అడవిలో నెలకొని ఉండటం వల్ల ఆలయం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు; తిరిగి మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు తెరిచి ఉంటుంది.

కొలనుభారతి ఎంతో మహిమ కలిగిన తల్లి అని, తగినంత



వయస్సు వచ్చినా మాటలు రాని పిల్లలకు ఈమె దర్శనంతో మాటలు వస్తాయని, వయస్సుకు తగ్గ తెలివితేటలు లేని పిల్లలు పన్నెండు సంవత్సరాల వయస్సులోగా ఈ దేవిని దర్శిస్తే తెలివి అబ్బుతుందని చెబుతారు. ఈ ఆలయంలో పిల్లలకు అక్షరాభ్యాసం అమ్మవారి సన్నిధిలో జరిపితే గొప్ప విద్యావంతులవుతారని భక్తుల ప్రగాఢ నమ్మకం.

**- కప్పగంతు వెంకట రమణమూర్తి**



## లేజర్ గన్స్‌తో ఆట !

తుపాకీతో ఆడటమంటే పిల్లలకు ఎంత సరదాగా ఉంటుందో అందరికీ తెలిసిన విషయమే! తుపాకీ పట్టుకుని డిష్యుం, డిష్యుం అంటూ షూట్ చేయడమంటే ఎంతో ఆనందాన్ని పొందుతారు చిన్నారులు. పిల్లలను ఆకర్షించే వెరైటీ ఆటలు మార్కెట్లో ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటాయి. ఇప్పుడు అదే వరుసలో ప్రొజెక్టర్ గన్ గేమ్స్ వచ్చాయి. ఈ గేమ్‌లో ప్రొజెక్టర్, లేజర్ గన్స్, కార్డ్స్ ఉంటాయి. గోడ మీద బొమ్మలు బాగా కనిపించేలా ప్రొజెక్టర్ పెట్టుకుని అందులో కార్డ్స్ వేసుకోవాలి. అది అటూ ఇటూ తిరుగుతుంటే ప్రొజెక్టర్ మీద బొమ్మలు కదులుతుంటాయి. అప్పుడు లేజర్‌గన్స్‌తో వాటిని షూట్ చేస్తూ ఉండాలి. తుపాకీ పేలిన శబ్దాలొస్తుంటే పిల్లలు షూట్ చేసినట్లు ఫీలవుతారు. పిల్లలకు ఇదో వెరైటీ ఆట.



## షార్పునర్లు వేలల్లో..

షార్పునర్లు వేలల్లో ఏంటి..! అని ఆశ్చర్యపోకండి. అమెరికాలోని లోగాన్ ప్రాంతంలోని మ్యూజియంలో సుమారు నాలుగు వేల షార్పునర్లు చూడవచ్చు.

పక్షులు, జంతువులతో పాటు వివిధ వస్తువుల ఆకారంలో వున్న షార్పునర్లు పిల్లలను ఆకట్టుకుంటాయి. ప్రపంచంలోని మొట్టమొదటి షార్పునర్ల మ్యూజియం ఇది. హాకింగ్ హిల్స్‌కు సమీపంలో ఉంది మ్యూజియం.

## సమీక్షలలో సాహితీ చైతన్యం

ప్రకృతిని వర్ణించే పద్యం, సమాజాన్ని మేల్కొల్పే వ్యాసం, భక్తిని వెలిబుచ్చే కీర్తన.. ఇవన్నీ నా అంతర్వాణి ప్రవంతులే అంటారు డాక్టర్ పూసపాటి వేదాద్రి. ఆయన రాసిన సమీక్షలు 'అంతర్వాణి' అందిస్తోంది. 60 సాహితీ వ్యాసాలలో రచయిత ఎందరో సాహిత్యకారుల సృజనాత్మక ప్రతిభను సమీక్షించడంలో తెలుగు సాహిత్యంలో కొత్త ఆలోచన, సరికొత్త చైతన్యం, జాగృతం చేసే ప్రయత్నం చేసారు. ఎన్నో కవితా సమీక్షలు, పద్య సాహితీ విశ్లేషణలు, కథలు, వ్యాసాలు, గ్రంథాల అధ్యయనం రచయితను సాహిత్యం వైపు మళ్లించటంతో ఈ సాహితీ ప్రవాహం వెలుగు చూసింది.



తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాల వంటి కథలు, కవితలు, వ్యాసాలు, నవలలు తనను ప్రేరేపించిన సాహితీ సమీక్షకుని ప్రయాణం యిది. మహనీయుల జయంతులు, వర్ధంతులు, గ్రంథాలయ వారోత్సవాల వంటి ప్రత్యేక సందర్భాలలో రచయిత స్పందనలను అంతర్వాణిగా సమీక్షా పరంగా వ్యక్తీకరించటమే 'అంతర్వాణి', సాహితీ ప్రవాహంగా చైతన్య జీవనానికి మార్గం చూపించే ఆత్మస్వర సాహితీ ప్రస్థానం.

**(అంతర్వాణి-రచన: డాక్టర్ పూసపాటి వేదాద్రి; వెల: రూ.200/-; ప్రతులకు: డా॥ పూసపాటి వేదాద్రి, 1-36, విజినేపల్లి గ్రామం, దొండపాడు-508 246, చింతలపాలెం మం॥, సూర్యాపేట జిల్లా, తెలంగాణ)**

## ప్రయోజనాత్మక రచన

**పుస్తక సమీక్ష**

'విద్యుక్త ధర్మ నిర్వహణలో జనని కుంతీదేవి' రచనలో ప్రముఖ విద్వత్కవి డా॥ బ్రాహ్మణపల్లి జయరాములు, ద్వాపర యుగం నాటి కథనాన్ని ప్రస్తుత అధునాతన సమాజ నడవడికను దృష్టిలో పెట్టుకొని అన్వయిస్తూ నవ్యత చేకూర్చే సందేశాత్మక విలువలతో రచించారు. భారతీయ సనాతన సంస్కృతిలోని నైతిక, మానవీయ, సామాజిక విలువలను నేటి నవతరం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపే దిశా నిర్దేశ లక్ష్యంతో డా॥ జయరాములు జనని కుంతీదేవి పాత్రపై దృష్టి సారించారు.

కుంతీదేవికి దుర్వాసుడు ఆపద్ధర్మ న్యాయంగా ప్రసాదించిన మంత్రం ఆమెకు సద్యోగర్భానికి కారణం అయిన అనూహ్య ఉదంతం, సహజీవనం, అమాయకంగా మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడే యువతరానికి కనువిప్పు కలిగించవలసిన స్థితిగతులను ప్రతిబింబింప చేస్తున్నాయి. సంతాన కాంక్షకు సంబంధించి నేటి కాలంలో టెస్ట్ ట్యూబ్ బేబీలు, సరోగసీ, అద్దెగర్భాలు పొందటం చూస్తున్నాం. కామోద్దీపనం కారణంగా ప్రాణాలను పోగొట్టుకొన్న పాండురాజు వంటి కథనాలు ప్రస్తుతం కూడా ఉన్నాయి. లోక ధర్మానుసరణగా నడిచిన కుంతీదేవి జీవన కథనం డా॥ జయరాములు సమాజ ప్రయోజనాత్మకంగా తీర్చిదిద్దారు.

కుంతీదేవిలా జీవించటం సాధ్యం కాకపోయినా నేటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రులు ధర్మ మార్గాన్ని తెలుసుకొని తాము జీవిస్తూ పిల్లలను తీర్చిదిద్దినట్లయితే సమాజం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లుతుందని డా॥ బ్రాహ్మణపల్లి జయరాములు అభిలషిస్తూ జనని కుంతీదేవి ఆదర్శనీయ వ్యక్తిత్వానికి అద్దం పట్టడం అభినందనీయం.

**(విద్యుక్త ధర్మ నిర్వహణలో జనని కుంతీదేవి-రచన: డా॥ బ్రాహ్మణపల్లి జయరాములు; వెల: రూ.200/-లు; ప్రతులకు: డా॥ బి.జయరాములు, ప్లాట్ నం.11, 1-3-176/35/22/11, భాగ్యలక్ష్మి నగర్, కవాడిగూడా, హైదరాబాద్-500 080)**

## యాత్రికులకు మార్గదర్శకం



తీర్థయాత్రలు చెయ్యడం తెలుగునాట ఒక మధురానుభూతి. కట్టా విరూపాక్ష శాస్త్రి 14 రోజుల తమ మానస సరోవర యాత్రా విశేషాలు, టూర్ డైరీని పుస్తక రూపంలో తీసుకువచ్చారు. 56 మంది బృందంతో చేసిన ఈ యాత్ర విలాస వినోద ప్రాధాన్యత కాకుండా, ఆధ్యాత్మిక పవిత్రత దృష్ట్యా భక్తి ప్రపత్తులతో నిర్వర్తించటం విశేషాంశం. కైలాస పర్వతాన్ని దగ్గరగా చూడటంతో రచయిత భావోద్వేగం, వాహనాల జాప్యంతో పడిన ఆందోళన, వర్ష వాతావరణం, మెడిసిన్స్, ఆక్సిజన్ యిస్తామని చెప్పిన టూర్ ఆర్గనైజర్, గైడ్ కమ్ ఆల్‌రౌండర్ పరిక్రమ సమయంలో పట్టించుకోకపోవటం.. వంటి విశేషాలు కూడా ఈ పుస్తకంలో పేర్కొన్నారు.

ఈ యాత్ర కలిగించిన దివ్యానుభవాలు పొందిన యాత్రికులు కొందరు తమ అనుభవాలతో పాటు సూచనలను, సలహాలను కూడా పొందుపరిచారు. భవిష్యత్తులో కైలాస, మానస సరోవర యాత్ర చెయ్యాలని అనుకొనేవారికి ఈ పుస్తకం మార్గదర్శకంగా ఉంది.

**(మా కైలాస, మానస సరోవర యాత్ర రచన: కట్టా విరూపాక్ష శాస్త్రి; వెల: రూ.200/-లు, ప్రతులకు: కె.వి.శాస్త్రి, 24-4-10/7/4, స్ట్రీట్ నం.10ఎ, విష్ణుపురి ఎక్స్‌టెన్షన్ కాలనీ, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-47)**

- జయసూర్య

# 26 ఏప్రిల్, 2026 నుండి 2 మే, 2026 వరకు



## వారఫలం


**శ్రీమతి ములుగు శివజ్యోతి,ప్రముఖ జ్యోతిష్యురాలు**
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం



ఈ వారం వృత్తి ఉద్యోగాల పరంగా మరింతగా శ్రమిస్తారు. అధికారుల మన్ననలను పొందడానికి ఉవ్విళ్ళూరుతారు. భగవంతుని మీద భారం వేసి మీ శక్తికి మించి ఒక కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కొత్త ఋణాలను చేస్తారు. పాత ఋణాలు తీరుస్తారు. సంతానం యొక్క భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కీలకమైన నిర్ణయాలను అమలు పరుస్తారు నిత్యం సర్వరక్షా చూర్ణంతో స్నానమాచరించండి.

### వృషభం



ఈ వారం శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. అప్రయత్నంగా అవకాశాలు కలిసి వస్తాయి. పెట్టుబడులకు తగిన సహాయం లభిస్తుంది. సన్నిహితుల నుండి ధన, వస్తు, లాభాలు పొందుతారు.

### మిథునం



ఈ వారం ఆరోగ్య పరిస్థితి చక్కబడుతుంది. అనుకున్న పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక లావాదేవీలలో ఏర్పడిన వివాదాలు పరిష్కారమై కొంత ధనలాభం పొందుతారు. స్థిరాస్థి వృద్ధి చేసుకుంటారు. కొత్త విద్యల పట్ల ఆసక్తి చూపుతారు. బంధువులు, మిత్రుల నుండి మంచి వార్తలు వింటారు. భాగస్వామ్య వ్యాపారాలలో స్వల్ప మార్పులు సంభవం. స్వల్ప ధనలాభం, తీర్థయాత్రలు, దైవ దర్శనాలు చేస్తారు.

### కర్కాటకం



ఈ వారం పెట్టుబడులకు తగిన లాభాలుపొందుతారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మీ నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. ఉద్యోగ, వివాహ యత్నాలు ఫలిస్తాయి. ఉన్నత పదవుల్లో ఉన్నవారిని కలుసుకొని ముఖ్యమైన విషయాలపై చర్చిస్తారు.

### సింహం



ఈ వారం చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఋణాలు తీరతాయి. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారా లలో విజయం సాధిస్తారు. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుతుంది. గృహం, వాహనాలు కొనుగోలు చేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. ఎదురు చూడని అవకాశాలు లభిస్తాయి.వృత్తి, వ్యాపారాలు లాభాలు పొందుతారు.

### కన్య



ఈ వారం జీవితం ఒకే గాడిలో సాగుతున్నట్లుగా భావిస్తారు. కొత్తదనాన్ని కోరుకుంటారు. ఊహా లోకాలలో విహరిస్తారు. శారీరక, మానసిక శ్రమ అధికంగా ఉంటుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు మంచితో మీరు చేసే ఒక పనిని మీ ప్రత్యర్థి వర్గం చెడుగా ప్రచారం చేస్తుంది. సంతానాన్ని క్రమశిక్షణలో నడిపించడానికి గాను మీరు చేసే ప్రయత్నాలు మంచి ఫలితాన్నిస్తాయి. అదృష్టాన్ని ఎక్కువగా నమ్ముతారు.

### తుల



ఈ వారం ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఏర్పడినా అధిగమిస్తారు. ప్రయత్నాలలో ముందుకు సాగవు. వృత్తి,వ్యాపారాలలో స్వల్ప మార్పులు చోటుచేసుకుంటాయి. వివాదాలు, కోపతాపాలకు దూరం గా ఉండండి. అష్టగణపతిని నిత్యం పూజించండి. బంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరవుతారు. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు చేసుకుంటారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

### వృశ్చికం



ఈ వారం చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగుతాయి. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చర్చా గోష్ఠులలో పాల్గొంటారు. భూ వివాదాలు తీరి లబ్ది పొందుతారు. శుభకార్యాల విషయాలలో మీ నిర్ణయాలు చర్చనీయాంశ మవుతాయి. నిత్యం ఆరావళి కుంకుమతో మహాలక్ష్మీదేవిని, సిద్ధగంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పూజించండి.

### ధనస్సు



ఈ వారం విద్యా వాణిజ్య రంగములలో ప్రోత్సాహకర వాతావరణము నెలకొంటుంది. ఈవారం అతిథి మర్యాదలకు అధికంగా ఖర్చు చేస్తారు. పిల్లలకు వివాహ విషయముల ప్రస్తావన వస్తుంది. తత్ సంబంధీకుల స్వతంత్ర నిర్ణయములు ఇబ్బందిని కలిగించ వచ్చును. విరాళములు, చందాలు, ఋణములు, పన్నులు వీటి విషయములలో ఒత్తిడి అధికమవుతుంది. గత స్మృతులను గుర్తుకు తెప్పించే సంఘటనలు జరుగుతాయి. ఋణ యత్నములు ఫలిస్తాయి. జీవితభాగస్వామి సలహాలను ఆచరణలో పెడతారు.

### మకరం



ఈ వారం బహిరంగ సమావేశాలలో పాల్గొంటారు. వస్త్ర, వడ్రంగి, ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారస్తులకు అను కూలంగా ఉంటుంది. అర్థంలేని రాజకీయాలతో కాలాన్ని వ్యర్థంగా గడుపుతున్న వారిని హెచ్చరిస్తారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఋణాలు ఇవ్వడం, కష్టించి పనిచేసే తత్వాన్ని పెంచుకుంటారు. పట్టుదలతో శ్రమించి వృత్తి, వ్యాపారాల పరంగా స్వల్పమైన అభివృద్ధిని కనబరుస్తారు. నిత్యం అష్టమూలికా తైలంతో లక్ష్మీతామర వత్తులనుంచి దీపారాధన చేయడం చెప్పదగినది.

### కుంభం




ఈ వారం పాత ఋణాలు తీర్చడానికి గాను కొత్త ఋణాలు చేస్తారు. పరిశోధన పట్ల అభిరుచిని కనబరుస్తారు. పనిభారాన్ని తగ్గించుకోవడానికి కొంత భాగాన్ని ఇతరులకు అప్పగిస్తారు. క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తారు. నూతన ఉద్యోగావకాశాలకు గాను మీరు చేసే ప్రయత్నాలు సానుకూల పడతాయి. నిజమైన శత్రువులెవరో తెలుసుకోగలుగుతారు. కుటుంబ సభ్యులతో స్వల్పమైన అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి. ఎక్కువగా ఊహాలోకాలలో విహరిస్తారు.

### మీనం




ఈ వారం నమ్ముకున్న వ్యక్తులు అప్పగించిన కార్యభారం సక్రమంగానే నిర్వహిస్తారు. అయితే ఆర్థిక భారం అవకతవకలు బయటపడతాయి. కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగాను బంధువర్గం చేసే వ్యాఖ్యలు ఇబ్బంది పెడతాయి. శుభకార్య నిర్వహణ గురించిన ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. కుటుంబ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

# ఈ వారం కార్టూన్స్


మీ మగపిల్లి వల్ల మా పిల్లి నాలుగు పిల్లల్ని కన్నది..
ఇందు.. రెండు పిల్లల్ని మీరు పోషించండి..!!


యుద్ధం 'లైవ్' చూస్తాం.. ఇరాక్ వస్తావా?!


ఏంటి బెదిరిస్తున్నావా..? ఇది హైద్రాబాద్..
సాయంత్రానికి వాన పడుద్ది...!!



బ్రైస్ కానియన్ నేషనల్ పార్కులోని శిలావనం
ఇది. వీటిని హుడూస్ అని అంటారు.
అమెరికాలోని ఉతా రాష్ట్రంలో ఉన్నాయి.









